నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com






# ఆధునిక నాగరికత సోకని పల్లెల్లోనే తెలుగు కొద్దోగొప్పో మిగిలి ఉంది–భాషావేత్త నలిమెల భాస్కర్

ఆధునిక నాగరికత సోకని పల్లెల్లోనే తెలుగు కొద్దోగొప్పో మిగిలి ఉందని ప్రముఖ భాషావేత్త డా॥ నలిమెల భాస్కర్ అన్నారు. పాళి, ప్రాకృతం, సంస్కృతం తదితర భాషలు కొన్ని వందల ఏళ్ళ తెలుగు మీద పెత్తనం సాగించాయని, తమిళులకున్నంత భాషాభిమానం తెలుగు వారికి లేకపోవడం బాధాకరం అని ఆయన విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో **'తెలుగు భాష–ఆధిపత్యాలు'** అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న నలిమెల భాస్కర్ **'తెలుగు–వివిధ భాషలు–ఆధిపత్యాలు'** అంశంపై మాట్లాడారు. తెలుగు తెలుగుగా మనుగడ సాగించలేని పరిస్థితులు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిపాలనలో పారదర్శకతను లోపింపచేసేందుకు పాలకులు ప్రజల భాషనుగాక, పండితుల భాషను పాలనా భాషగా కొనసాగిస్తుంటారని ఆయన విమర్శించారు. ప్రముఖ సాహిత్య విమర్శకుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి **'తెలుగు భాష– సాహిత్య ప్రభావం'** అంశంపై మాట్లాడుతూ ఇంటర్‌లో సంస్కృతం సబ్జెక్టు ఎనిమిదో వింతగా మారిందని ఎద్దేవా చేశారు. ఆంగ్ల మాధ్యమాన్ని ఇష్టపడుతూ, తెలుగు భాష వికాసం గురించి మాట్లాడితే ప్రజలు విశ్వసించరని పరోక్షంగా ప్రభుత్వాలను విమర్శించారు. భాష, సాహిత్యం, సమాజం, కాలంతో పాటు మారడం సహజం. కానీ వాటిపై ఆధిపత్యాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ముస్లిం రాజులు ఎన్నడూ తెలుగు భాష, సాహిత్యాల మీద ఆధిపత్యం చూపలేదని ఆయన తెలిపారు. **'తెలుగు భాష–ప్రసార మాధ్యమాలు– ప్రభావాలు'** అంశంపై ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక వివక్షకు లోనవుతున్న సమూహాల పదజాలాన్ని ప్రామాణిక భాషలో భాగం చేసేందుకు విధానపరమైన నిర్ణయాలు అవసరమని సూచించారు. పత్రికలు కొన్ని పదాలను ప్రామాణీకరణ చేస్తున్నాయని, ఐక్యరాజ్యసమితి వంటి కొన్ని మాటలను సృష్టించింది కూడా పత్రికా రంగమేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం ప్రధాన అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, కార్యదర్శి వి. శంకర్, శ్రీరామోజు హరగోపాల్, ఘనపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రధాన ప్రసంగం చేస్తున్న డా॥ నలిమెల భాస్కర్. వేదికపై కందుకూరి శ్రీరాములు, వి. శంకర్, డా॥నందిని సిధారెడ్డి, డా॥రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ కె. శ్రీనివాస్.

# జీవం ఉట్టిపడే కథల రూపశిల్పి వారాల కృష్ణమూర్తి


1-7-1950 - 17-12-2022

"ముళ్ళ జిల్లేడు కంచెల పదును అంచుల మీదికి మన సంతానం అంధ భిక్షువుల్లా పడిపోకుండా కాపాడగలిగేది కథే. కథే మనకు తోడు. అది లేకుండా మనం గుడ్డివారమే. గుడ్డి వారికి తోడు ఎలా వారి సొంతం కాదో, అలానే కథ కూడా మన సొంతం కాదు. ఇంకా చెప్పాలంటే, కథే మనల్ని సొంతం చేసుకుని, దిశా నిర్దేశం చేయిస్తూ వుంటుంది".

ఇదే నిర్దేశంతో కథా రచనకు శ్రీకారం చుట్టి గత 35 సంవత్సరాల నుండి తెలుగు సాహిత్యానికి కృషి చేస్తున్నవారు వారాల కృష్ణమూర్తిగారు. ఆయన తన చుట్టూ వున్న సమాజ తత్వాన్ని ఆకళింపు చేసుకుని, ఆర్థిక సంబంధాల్లోంచీ, గ్రామీణ జీవనం నుంచీ, బడుగు జీవుల బతుకు బాధల్నుంచీ యితివృత్తాల్ని ఎన్నుకొని, పదునైన మాటల్లో స్పష్టమైన వాక్యాల్లో, బలంగా, సూటిగా కథలు రాశారు. వ్యక్తి ప్రయోజనం కన్నా సమాజ ప్రయోజనం మిన్న అన్న భావన నూరేళ్ళ తెలుగు కథకు తనవంతుగా వంద కథలపై చిలుకు అందించారు.

సమాజం ధనిక, పేద అనే వ్యత్యాసంతో అస్తవ్యస్తంగా తయారై ఉన్నప్పుడు, వంద మందిని బలహీన పరిచి ఒక్కడు లావెక్కుతాడు. అలా ఒక్కడు బలవటం ఏం మంచిది? "బానిసత్వం నుండి పేదరికం నుండి, మానవజాతి విముక్తి పొందాలని వేదన, సంఘర్షణ, ఎంత వ్యాకులత అనుభవిస్తాడో ఆ సాహిత్యకారుడి రచనలలో అంత వాస్తవికత వెలుగునింపుకుంటుంది. అనుభూతుల్ని క్రమ పద్ధతిలో వ్యక్తీకరించే విధానమే కళాకౌశలం యొక్క రహస్యం.

కృష్ణమూర్తిగారు తను గాఢంగా నమ్మినవీ, యిష్టపడినవీ తన కథల్లో ఆవిష్కరించారు. లేని గొప్పలకు పోలేదు. ఉన్న విషయాల్నీ వక్రీకరించలేదు. వాస్తవాన్ని యథాతథంగా ఒక డాక్యుమెంటరీలా మన ముందుంచుతారు. ఈయన తన కథలకు ప్రేరణ 'సమస్యే' అంటారు. సమస్య బలంగా వున్నప్పుడు కథ కూడా బలంగా వుంటుందని నమ్ముతారు. రచయిత సమస్య మూల కారణాలను పట్టుకోవాలి. దానికి నివారణా కారకాలను వెతకాలి. అప్పుడే గొప్ప కథలు పుడతాయని ఈయన విశ్వసిస్తారు. ఇందుకు కారా మాష్టారిగారి కథలను ఉదహరిస్తారు.

కృష్ణమూర్తిగారు తన సాహిత్య ప్రస్థానాన్ని నెల్లూరు వి.ఆర్. కళాశాల "తెలుగు లిటరరీ అసోసియేషన్"లో ప్రారంభించి హైదరాబాద్ 'కళావాహిని' సంస్థలో శీలా వీర్రాజుగారి ప్రోద్బలంతో రచయితగా నిలదొక్కుకున్నారు. ఆయన చేత కథలు రాయించి, ఆ కథలను "దేవరదున్న" కథల సంపుటిగా తీసుకురావటానికి బాధ్యత వహించిన శీలావీర్రాజుగారు కృష్ణమూర్తి గార్కి గురుతుల్యులు. శీలా వీర్రాజుగారి ప్రోత్సాహంతో వచ్చిన కృష్ణమూర్తిగారి "డూప్ కథ"బాగా ప్రాచుర్యం పొందింది. అవకాశాలు రాక ఒక అబ్బాయి, ఒక అమ్మాయి హీరో హీరోయిన్‌లకు డూపులవుతారు. అనుకోకుండా అమ్మాయికి హీరోయిన్ ఛాన్సు వస్తుంది. డూపు హీరోని విస్మరించి, నిజమైన హీరోను పెళ్ళి చేసుకుంటుంది. రచయిత కథను కొత్త తరహాగా ఆవిష్కరించడం వలన పాఠకలోకానికి కథ బాగా దగ్గరయింది.

విజయబాపినీడు "విజయ" పత్రికలో 'చింతచెట్టు' కథ వచ్చినప్పుడు, కృష్ణమూర్తిగారు తెలుగు సాహిత్య లోకానికి బాగా దగ్గరయ్యారు.

**కథా రచయిత వారాల కృష్ణమూర్తి (72) ఇకలేరు. పదిహేను రోజుల కిందట మెట్ల మీద జారిపడి ఆయన నగరంలోని ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న శనివారం తుదిశ్వాస విడిచారు. కృష్ణమూర్తి స్వస్థలం చిత్తూరు జిల్లా. హైదరాబాద్‌లోని ఆడిటర్ జనరల్ (ఏజీ) ఆఫీసు ఉద్యోగిగా, 'రంజని' సాంస్కృతిక సంస్థ కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తించారు.తెలుగు నాటక సమితికి రచయితగా, నటుడిగా కోశాధికారిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. పదవీ విరమణ అనంతరం కూడా అనేక నాటకాలు రచించారు. త్రిపురనేని గోపీచంద్ 'పతితులు', కారా 'చావు' కథలను నాటకీకరించారు. వారాల కృష్ణమూర్తి రాసిన 'దేవరదున్న' కథా సంపుటి ఆయనకు గర్తింపు తెచ్చింది. ఆయన రచించిన 'ఎలా బతకాలి' నాటకం 2005లో ఏపీ నంది నాటక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. 'తూర్పుకొండలు' తదితర నవలలూ రాశారు. కృష్ణమూర్తి కథల్లోని సామాజిక స్పృహ అంశంపై హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ విద్యార్థి కిషోర్ ఎంఫిల్ పరిశోధన చేశారు. తెలుగు నాటక రంగంలోని ప్రయోగాలపై కృష్ణమూర్తి రాసిన పరిశోధనా వ్యాసాలను తెలుగు అకాడమీ ప్రచురించింది. ప్రజాసాహితీ, జన సాహితీ సంస్థలకు అభిమానిగా ప్రజా కళలను విస్తరింపచేసే ఉద్యమంలోనూ భాగస్వామిగా నిలిచారు. వారాల కృష్ణమూర్తి భౌతికకాయానికి కవి ఆశారాజు, స్త్రీ సంఘటన లక్ష్మి, జనసాహితీ సభ్యులు, ఏజీ ఆఫీసు ఉద్యోగులు నివాళులు అర్పించారు. శంకరంపేటలో ఈ నెల 17 శనివారం సాయంత్రం కృష్ణమూర్తి అంత్యక్రియలు ముగిశాయి.**

> "ఏ రచయిత కూడా అన్ని తెలుగు మాండలికాలలో రచనలు సాగించ లేదు. ఈయన అది సాధించారు. సమస్య ఏ ప్రాంతానిదో ఆ ప్రాంతమాండలికాన్ని తీసుకుని, కథలు జీవం ఉట్టిపడేటట్టు కథలను రూపొందించారు కృష్ణమూర్తిగారు"

ఈయన కథలపట్ల ఆకర్షితుడై బాపినీడుగారు 'విజయ'లో ప్రతినెల ఒక కథ వచ్చేటట్లుగా ప్రోత్సహించారు. నీలిమ పత్రికలో ఒక ఏడాది మొత్తం కథల్లో 'వారసులు' కథ ఉత్తమ కథగా ఎంపికయింది. 'అస్తమించని సూర్యుడు' కథలు ప్రజా కవిని ప్రజలే కాపాడతారన్న సత్యాన్ని తెలియజేశారు. విశాలాంధ్రవారు ప్రచురించిన "వందేళ్ళ తెలుగు కథ" సంపుటిలో కృష్ణమూర్తిగారి "జీవంలేని మొక్క" అనే కథ చోటు సంపాదించుకుంది. "వ్యవసాయానికి దూరమైన వాళ్ళు బాగుపడ్డవాళ్ళే. వ్యవసాయానికి అంకితమైనవాళ్ళు మట్టిలాగే మట్టి కొట్టుకుపోతున్నారు. కథలో రెండు పాత్రలు భూమిని నమ్ముకున్నవాళ్ళే. దళారీల చేతిలో మోసపోయిన జీవంలేని మొక్కలే అన్న చేదు నిజాన్ని దర్శింపజేశారు. ఈ కథ మీదనే చేకూరి రామారావుగారు తన "చేరాతలు"లో రెండు వ్యాసాలు రాశారు.

కేంద్ర సాహిత్య అకాడమీ, ఢిల్లీ వారి "ఈతరం కథ" లో కృష్ణమూర్తి గారి రచయిత పెళ్ళాం కథ' స్థానం సంపాదించుకుంది. వాకాటి పాండు రంగారావుగారి ఎడిటోరియల్‌లో "ఆనాటి కథల నుండి యీనాటి కథల వరకు" అన్న శీర్షికలో కృష్ణమూర్తిగారి కథలను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈయన రాసిన "రాక్షస సంహారం" అనే కథ ఆటావారి బహుమతికి ఎంపికైంది. దౌర్జన్యాలను వదిలి, సొంతంగా ధర్మంగా బతకానికి వీలులేని పరిస్థితుల్ని, యంత్రాల కుతంత్రాలను, కునారిల్లిన జీవితాలను తెలియజేసే కథ యిది. ఈయన 'పారాహుషార్' కథ రచన పత్రికలో బహూమతికి ఎంపికైంది. గ్లోబలైజేషనుకు చిన్న చితక జీవితాలు ఛిద్రమైన స్థితిని కళ్ళకు కట్టినట్లు అక్షరాల్లో చిత్రించారు. పోస్టాఫీసుల్ని ఎస్‌టిడి బూతులు, ఎన్‌టిడి బూతుల్ని లాండ్‌లైన్లు, లాండ్ లైన్ల ఫోన్లను సెల్‌ఫోనులు, మింగేసిన క్రమాన్ని, దానికి బలైన జీవితాల్ని అద్భుతంగా చూపించారు ఈ కథలో.

ప్రజాసాహితీ ప్రత్యేక సంచిక "గ్రామీణ జీవన విధ్వంసం–రైతాంగ ఉద్యమం"లో "యాది" కథలు– బతుకు బారమైనప్పుడు రోజు రోజుకూ భయంకరమైన నరకంలా మారుతున్నప్పుడు ఇద్దరాడాళ్ళు నిబ్బరంతో బాధల నుంచి విముక్తి పొందిన వైనాన్ని రచయిత వారాల కృష్ణమూర్తిగారు బాగా పండించారు.

కృష్ణమూర్తిగారు 'కాలజ్ఞానం' కథలో కాలంలో వచ్చిన మార్పులను మనిషి అలవరచుకోవాలని, మార్పుని అభివృద్ధి సంకేతంగా భావించాలన్న సంకల్పాన్ని పునద్ఘాటించారు. ఈ కథ కూడా బహుమతి పొందింది.

వారాల వారు తన సొంత కథలనే నాటికలు, నాటకాలుగా ఎన్నింటినో మలిచారు. మాయ, చింతచెట్టు, సన్ ఫ్లవర్సు, మే ఐ హెల్ప్ యు మొదలైనవి. అంతేగాక తనకు వచ్చిన రచయితల కథలను కూడా నాటకీకరణ చేశారు. గురజాడ అప్పారావుగారి "దిద్దుబాటు" గోపీ చంద్‌గారి "పతితులు" కారామాష్టారి గారి "చావు" కథలను నాటకీకరణ చేసి ప్రదర్శించారు. ఈయన కేవలం రచయితే కాకుండా నాటికలు, నాటకాల్లో అడపాదడపా చిన్న చిన్న వేషాలు వేసేవారు.

కృష్ణమూర్తిగారి నవల "తూర్పు కొండలు" జ్యోతి మాసపత్రిక నవలల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందింది. "దేవరదున్న" కథల సంపుటికి ఎఆర్‌టిఓస్ సాహిత్య పురస్కారం అందుకున్నారు.

ఏ రచయిత కూడా అన్ని తెలుగు మాండలికాలలో రచనలు సాగించ లేదు. ఈయన అది సాధించారు. సమస్య ఏ ప్రాంతానిదో ఆ ప్రాంత మాండలికాన్ని తీసుకుని, కథలు జీవం ఉట్టిపడేటట్టు కథలను రూపొందించారు కృష్ణమూర్తిగారు. ఈయన కథలపై సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి కిషోర్ "వారాల కృష్ణమూర్తి కథలు–సామాజిక స్పృహ" అనే అంశంపై ఎం.ఫిల్ పరిశోధనా వ్యాసం సమర్పించారు.

కృష్ణమూర్తిగారు తన కథలను ఆదరించే మిత్రుల సహకారాన్ని ఎన్నడూ మరువలేనిదిగా భావించి, "తన జీవితానికి సాహిత్యానికి ఏ.జి. ఆఫీసు వేదిక" అని ప్రకటించుకున్నారు.

ఆయన 'రంజని' సంస్థకు కార్యదర్శిగా వుండి కె.కె. మీనన్ సహకారంతో కారా మాష్టారిగారి 'యజ్ఞం' కథలపై ప్రత్యేక సంచికను తీసుకొచ్చారు. ఏ.జి. ఆఫీసు, తెలుగు నాటక సమితికి రచయితగా, నటుడిగా, కోశాధికారిగా తనవంతు సేవలు అందించారు కృష్ణమూర్తి.

> "కృష్ణమూర్తిగారు తను గాఢంగా నమ్మినవీ, యిష్టపడినవీ తన కథల్లో ఆవిష్కరించారు. లేని గొప్పలకు పోలేదు. ఉన్న విషయాల్నీ వక్రీకరించలేదు. వాస్తవాన్ని యథాతథంగా ఒక డాక్యుమెంటరీలా మన ముందుంచుతారు"

('రంజని' శ్రీ వినోదినామ ఉగాది సంచిక నుండి...)



–ఎం.కె. పంటా

## బుక్ ఫెయిర్

హైదరాబాద్ లో నడి బొడ్డున పుస్తకాల పండుగ
బడి పిల్లలతో మొదలు రిటైర్డ్ ఉద్యోగుల వరకు
సెలబ్రిటీల నుండి సామాన్యుల దాకా
పుస్తకాల తాకిడి జోరుగా సాగుతూ
పుస్తక ప్రియులకు పండుగ వాతావరణం వచ్చింది

బాల సాహిత్యం నేటి తరానికి అవసరం
నేడు శాస్త్ర సాంకేతికత పరుగులు తీస్తున్న
తరుణంలో పిల్లలకు పుస్తక పఠనం తప్పనిసరి
యువ సైన్యానికి పుస్తక పరిజ్ఞానం దిక్సూచి
నవ భారత నిర్మాణంలో యువత మేధస్సు.

దేశ నలుమూలల రచయితల పుస్తకాలు
హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో లభ్యం
రోజుకు వెయ్యిలలో సందర్శకుల తాకిడి
లక్షలలో కొనుగోలు అమ్మకాలు ఆకర్షణీయమైన
బుక్ స్టాల్స్, జనంతో కిక్కిరిసి జాతరల దర్శనమిస్తూ
హైదరాబాద్ బుక్ ఫెయిర్....

తరలి రండి సాహిత్యానికి పూర్వ వైభవం తెద్దాం
భారత చరిత్ర మూలాలను కాపాడుకుందాం.....



–మిద్దె సురేష్
9701209355

## పుస్తకాల జాతర !

ప్రతి పుస్తకం తెరిస్తే
జ్ఞానంగా వెలుగులు అస్తమించని
భాస్కరులు జీవిత కాలమంతా!
ఒక్కో పేజీ తెరుచుకుంటే విజ్ఞానంగా మైలురాళ్లు
దాటుతున్నట్లే అనంతంగా!
ప్రచురణగా ఒక్కొక్కరి గొప్ప జీవితానుభవం
బతుకు పుస్తకం మార్గదర్శనం !
మన ప్రయాణంలో బ్యాగులో పుస్తకం లేకుంటే ఎలా
పయనమయే కాలమంతా వ్యర్థమై
గాలిలో కలిసిపోతుంది!.

సభారంజకంగా ఉపన్యసిస్తున్నామంటే మన
మనసులో నిక్షిప్తమైన పదజాలం ఇంద్రజాలమే కదా !
ఇంట్లో ఎవరూ లేనపుడు అలమారాలోని
పుస్తకాలే బయటకు వచ్చి అక్షరం అక్షరంగా
మాట్లాడిస్తాయి పదిమంది ఇంట్లో ఉన్నట్లే ఇగ.

ఎన్ని పుస్తకాలున్నా ఇంకా కొత్తవి తెచ్చుకోవాలనే
ఆపేక్ష జ్ఞానదాహం !
బుక్ ఫెయిర్ లో పుస్తకాలను చూస్తే
ఎన్నెన్నో వరప్రసాదాలు !
కొత్త పుస్తకాలు కొని చదివితేనే సరికొత్త జీవితం



–కందాళైరాఘవాచార్య
8780593638

## పుస్తకమే జ్ఞాన ప్రదాయినీ...!

పుస్తకంబుజదువపొందువి జ్ఞానము
హస్తభూషణంబునమలువద్దు
అధ్యయనమువల్ల అవగతమౌ పలు
అంశములును మనకు అర్థమగును!

చిరిగి నట్టి చొక్క చేకొని వేసుకో
మంచిపొత్తమొకటి మరువకిలను
కొనియు చదువ కొండంత తెలివబ్బు
నిజముచూడుభువిన నీకుదెలియు!

రకరకములుగలవు రమణీయపుస్తకాల్
చదువ మేధ హెచ్చు సవ్య ముగను
గ్రంథ పఠన వల్ల గంభీర ధీయుతుల్
మస్తకంబున వెలిగి మదియునిండు!

తెలుగులోనగలవు తేజమౌ కావ్యముల్
పఠిత చదివి చూడ పరిణితబ్బు
ఎంత చదివగాను చింతయే మియులేదు
జ్ఞానసంపద కిల కొదువలేదు!

వివిధ ప్రక్రియలను విపుల ముగ చదువ
కొత్తపోకడలను కోర్కెదీర్చు
జ్ఞానసిద్ధి గల్గి కూర్చును నేర్పును
పుస్తకపఠనవల్ల పొందుతెలివి!

అమ్మవంటిదిలను అరయగ రచనలున్
ఎంతచదువినేర్చ నెదిగి ఒదిగి
పరులకిలనుపంచ పరగ తరగదుగా
పొత్తమేను భవిత పోడ్మి హెచ్చు!!



–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,

## జీర్ణమంగే సుభాషితమ్ !

మహనీయుల సూక్తులు
మరుగునపడిపోతున్నాయి
మనిషికి ధనం, అధికారాలే
మాన్యంగా మారుతున్నాయి
నీతితేనితనానికి
నిత్యం దారులు తెరుచుకుంటున్నాయి
ఖ్యాతి అపఖ్యాతిగా మారుతోంది
సత్యపథంలో కంటకాలెదురౌతున్నాయి
మనిషి బలహీనుడౌతున్నాడు
మత్తులో జోగుతున్నాడు
పాపాల గుట్టలు పెరుగుతున్నాయి
అమాయకుల మనస్సులు మరుగుతున్నాయి !

డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.



## అక్షరం

నా సలక్షణమై అక్షరాలు
మనోఫలకంపై... ఓలలాడే భావతరంగాలు
తిరుగాడే మౌక్తికాలు
వాటికి స్వచ్ఛత తప్ప
ఏ జిత్తులు తెలియవు
నిర్భయంగా నిర్మొహమాటంగా
సంచరించే స్వేచ్ఛా గీతికలు.
వాటికి తెలుసు.....
ఎదుటివారి బాధకు తపించడం
ఆపదలోనున్న సమయంలో స్పందించడం.
వాటికి ఎరుక....
అందరిలో తానుండాలని
అందరికీ తాను కావాలని.
అవి గమనిస్తాయి....
సాయం చేసిన మనసును మరువకు
ఆపదలో వచ్చిన ఆశను చెరపకు.
అవి సరి చేస్తూనే ఉన్నాయి....
ప్రకృతితో మమేకమై
ధరిత్రిపై పది మందితో జత కలపమని
పదుగురి మేలు కోరుకొమ్మని
అక్షరాలు నాతో అంటాయి......
నవ్వుతూ నవ్విస్తూ నర్తించమని
విలువల వలువలతో నడయాడమని.
అవే నాకు సూచిస్తాయి.....
ఈ లోకం నడిచే వాళ్ళపైన
నాలుగు రాళ్లు విసురుతారని
మాటల అస్త్రాలతో బాదిస్తారని
అలాంటి వాళ్ళ హృదయం మార్చుమని
నేను అంటాను మనం మనలాగా ఉండి,
మంచి బాటను పయనిస్తూ
మాలిన్యం లేని బంధాలతో
జత కలిపె అడుగులతో
అభ్యుదయ వెలుగు బాటలో
మన నడకను సాగిద్దాం

–డా.శ్రీభాష్యం అనూరాధ
8790325502



## నానీలు

కాయలు కాసేది
చెట్లకే కాదు
నాన్న చేతులకు
అమ్మ కళ్ళల్లో కూడా

చిన్నప్పుడు తిట్టారు
గాలి తిరుగుడని
ఇప్పుడు
విమానం పైలట్

–సుధా మైత్రి
సెల్: 9989042236

# "ముంబయిని ఛత్ర ఛాయమా" గ్రంథావిష్కరణ



పుస్తకావిష్కరణలో బండారుపల్లి రామచంద్రరావు, అంబల్ల జనార్దన్, జిగ్నేష్ దోషీజీ, రఘుశ్రీ, డా॥ ఎస్.సి. ఉపాధ్యాయుల

సాహిత్యం సమాజ హితానిరి దారి తీయాలని, మనుషుల ఐక్యతను పెంపొందించాలని ప్రముఖ సంఘ సేవకులు, శ్రీ గురజాడ ప్రగతి సమాజ్ కార్యదర్శి జిగ్నేష్ దోషీజీ అన్నారు. శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్–గుజరాతి వెల్ఫేర్ సొసైటీ, శ్రీ త్యాగరాయ గానసభ, మానస ఆర్ట్స్‌ల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డా॥ అంబల్ల జనార్ధన్ తెలుగు కథల గుజరాతీ అనువాదం ముంబయిని ఛత్ర ఛాయామా" గ్రంథావిష్కరణ సభ ఈ నెల 27న మంగళవారం శ్రీ త్యాగరాయ గానసభ మినీ హాల్‌లో జరిగింది.

సీనియర్ న్యాయవాది, రచయిత డా" హెచ్.సి. ఉపాధ్యాయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీ గుజరాత్ ప్రగతి సమాజ్ కార్యదర్శి, గుజరాతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు శ్రీ జిగ్నేష్ దోషి ముఖ్య అతిథిగా విచ్చేసి "ముంబయిని ఛత్ర ఛాయామా" గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. మాతృభాషలలోని గ్రంథాలను ఇతర భాషలలోకి అనువదించటం ఒక అదృష్టమని, అన్ని భాషల సామాజిక సంస్కృతులు జాతీయ సమైక్యత దోహదం చేస్తాయని అన్నారు. ఒక గుజరాతీయుడు ఈ కథల పుస్తకం ఆవిష్కరించడం ఒక అదృష్టంగా పేర్కొన్నారు.

సభాధ్యక్షులు, సీనియర్ న్యాయవాది, రచయిత డా॥ హెచ్.సి. ఉపాధ్యాయ మాట్లాడుతూ మానస ఆర్ట్స్ విలక్షణమైన కథల పుస్తకాన్ని అందించటం అభినందనీయమని, చిన్నకథలు ఎంత చిన్నవిగా ఉంటే అంత రాణిస్తాయని అన్నారు. పుస్తకంలోని కథల ప్రత్యేకతను వివరించారు.ఇంకా సభలో బండారు పల్లి రామచంద్రరావు, డా॥ అంబల్ల జనార్ధన్, రఘుశ్రీ, డా॥ లలితవాణి, కనకదుర్గ, డా॥ నర్మదారెడ్డి, వాణిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఈ సందర్భంగా గ్రంథకర్త డా॥ అంబల్లను అతిథులు ఘనంగా సత్కరించారు.

## వృద్ధాప్యం

పెక్కు అనుభవాలసారం వృద్ధాప్యం
జ్ఞాన విజ్ఞానయుక్తం వృద్ధాప్యం.

సుకృతులకు ప్రేరణ వృద్ధాప్యం
వ్యథలలో ఓరిమినందించు వృద్ధాప్యం.

శిశువులకు ఆశీస్సులందించు వృద్ధాప్యం
యువతకు సదుపదేశాలందించు వృద్ధాప్యం.

ఆదర్శాలకు ఆలవాలం వృద్ధాప్యం
అసూయలనరికట్టు వృద్ధాప్యం.

వట్టి మాటలకు అడ్డుకట్ట వేసేది వృద్ధాప్యం
విశ్వమంతటికీ గట్టిమేలు తలపెట్టేది వృద్ధాప్యం.

వృద్ధుల సుద్దులు
అనుభవాల రాసులు

వృద్ధాప్య వ్యాధులు ఆవరించుకున్నా
వ్యథచెందక ధైర్యం వీడరు వృద్ధులు.



దురాశను దరిచేరనీయరు–
లేమికి వగచెందరు వృద్ధులు

పొగడ్తలకు పొంగిపోరు
తెగడ్తలకు తెల్లబోరు వృద్ధులు.

– అమర్‌జీ
సెల్: 9620186222

## దేనికో...?

నిదుర నిండని కళ్ళల్లో
పరుగులెత్తే కలలు దేనికో..

హృదయం నిండా లేని
రూపానికి పై పై నగిషీలు దేనికో..

మౌనం మాటున
దాగిన గానానికి రాగాలెందుకో..

నీలువ నీడలేని
ప్రాంతంలో వ్యాపారాలకై ఆతృత దేనికో..

దళారీ వ్యవస్థ ఉన్న నేటి సమాజంలో
రైతన్న మీద ఎందుకూ ఉపయోగ పడని
ప్రేమ దేనికో..

అత్యంత ధనవంతులు కలిగిన
దేశంలో పేదవాడి ఆకలి కేకలు దేనికో..

బడా వ్యాపారులకు అప్పులు ఇచ్చి
వాళ్లు కట్టకపోతే మాఫీ చేసే బ్యాంకులు..
సామాన్యుడు కొన్ని నెలలు ఈఎంఐ కట్టకపోతే
ఇంటి మీదకి వచ్చి చేసే దాడి దేనికో..

పెద్ద పెద్ద వ్యాపారులకు
ఎర్ర తివాచీ పరిచి
మరీ రాయితీలు ఇచ్చే ప్రభుత్వాలు..
చిన్న చిన్న వ్యాపారుల మీద
నడ్డి విరిగేలా వడ్డించే పన్నులు దేనికో..



– ఏడుకొండలు కళ్ళేపల్లి,
9490832338

## మానవ మృగం

అతి కిరాతకం,
అత్యంత దారుణం,
కర్కోటకుడై, రాక్షసుడై
ప్రవర్తించిన తీరు వింటేనే
ఒళ్ళు జలదరిస్తుంది,
కంట నీరు యేరులై పారుతుంది
మనిషిని నమ్మి, సహజీవనం చేయ వచ్చిన
ప్రియురాలును, తన తనువును అర్పించిన
సహచరిని ప్రేయసిని
కాపురము చేసిన అమ్మాయిని
కేవలం పెళ్ళి చేసుకొమ్మని అర్థించిన అబలను
విచక్షణ మరచి, రాక్షసుడై గొంతునులిమి చంపి,
శరీర అవ్వవాలను ముక్కలు ముక్కలుగా నరికి
కొన్ని రోజులుగా వాటిని ఫ్రిడ్జ్ లో దాచి
ఆపై కొద్దికొద్దిగా పారావేచే ఆ కిరాతకుడుకు
ఏ శిక్ష విధించాలి?
అలాంటి కరకు రాతి గుండె గల
(పేరు చెప్పడానికి మనసు రాక )
శాడిస్టు మృగాలు నుండి స్త్రీ జాతిని
ఎలా రక్షించాలి?
దీనికి పెద్దల తీర్పు ఎలా ఉంటుదో వేచి చూడాలి?
మానవ తోలు కప్పుకుని
సమాజారణ్యములో తిరుగాడే
మృగాలు నుండి స్త్రీ లను
రక్షించే నాథుడెవ్వరో?
*(ఒక పత్రికలో "గొంతు నులిమి... ముక్కలుగా
నరికి శీర్షిక తో వచ్చిన
న్యూ ఢిల్లీలో జరిగిన వాస్తవ
సంఘటనకు స్పందించి... )*



–విశ్వనాథ నరసింహం
9490971589

# మహాకవి కత్తి పద్మారావు కవిత్వం ఒక దేశీయ చిత్రపటం



"ఈ దేశం మాది" అంటూ ధిక్కార పతాకమైన కవిత్వం

దళిత స్పృహ ద్వారా దళిత సాహిత్యం సృష్టించబడింది. ఈ వాస్తవాన్ని అంగీకరించేదే ఆ సాహిత్యం. దళిత సాహిత్యం దేవుడు, మతం, ఆత్మ, కర్మ, అద్భుతాలు, పూర్వజన్మ, పునర్జన్మను పూర్తిగా నిరాకరిస్తుంది. వర్ణానికి – వర్ణవాదానికి వ్యతిరేకంగా దళిత సాహిత్యం సాహిత్య స్వరాన్ని పెంచు తుంది. సమాజంలో వ్యాప్తి చెందిన సామాజిక, ఆర్థిక వైషమ్యాలకు తీవ్రంగా ప్రతిఘటిస్తుంది సమానత్వం మనిషి విధాన ప్రవృత్తులను అంగీకరిస్తుంది. – వామన్ నింబాల్ కర్, మరాఠీ దళిత పాంథర్స్ కవి.

దళిత పదం అంబేద్కర్ గారి ఉద్యమంలో నవంబర్ 16, 1928న బహిష్కృత భారత్ అనే సంచికలో కనిపిస్తుంది. డిసెంబర్ 30. 1939న జనతా పత్రిక వ్యాసాలలో 'దళితులకు జరిగే అగౌరవం దళితుల పదం 'అంటరాని తనం'కి పర్యాయ పదంగా వాడారు. సైమన్ కమీషన్ సందర్శనలో సర్. హిరిసింగ్ గౌర్, అంబేద్కర్ గారి సంభాషణలో "డిప్రెస్డ్" అనే పదం వచ్చింది.

డా॥అంబేద్కర్‌ని "అణచబడిన దళితుల వర్గం, అంటరాని వర్గం రెండింటిని సమాన అర్థంలో వాడారా" అని సర్ హరిసింగ్ గారూ అడిగినప్పుడు అంబేద్కర్ గారు అవునని సమాధానమిచ్చారు. 1950 సం॥లో మహారాష్ట్ర దళిత సాహిత్య సంఘం స్థాపించబడింది.

దళిత పాంథర్స్ రచయితలు బాబూరావు బాగుల్. డా.మ.నాన్ ఖేడే, ప్రొ. మ.భి.చిట్నీస్, ప్రొ. కేశవ్ మేశ్రామ్, డా. గంగాధర్ పానతావణే, రాజాధాల్ మొదలైన వారు దళిత సాహిత్యాన్ని వివరిస్తూ దళిత పదానికి విస్తృత అర్థం ఇచ్చారు.

దళిత పాంథర్స్ కవి బాబూరావ్ బాగుల్ ఒకచోట.

"నాకు తెలుసు / ఈ దేవాలయాల దేశంలో చార్వాకుడు పాతిపెట్ట బడ్డాడు / బుద్ధుడు అవతారపురుషుడయ్యాడు./ రావాలనుకుంటే తుఫాను వేగంతో వచ్చెయ్/ లేకుంటే చార్వాకుడిలా... ఉప్పు పాతరౌతావు.

ఎప్పటికి రావడం సాధ్యమౌతుందో
అప్పటి వరకు వచ్చెయ్
కానీ కనీసం అరచేత పట్టుకొన్న
అంబేద్కర్ గారి ఆలోచనల అగ్ని
మంటని మాత్రం ఆరనీకు

డా॥ రాన్ సాహెబ్ కసబే అంబేద్కర్ వాదాన్ని వివరిస్తూ "సమానవత్వం, స్వేచ్ఛ, సోదర భావం, న్యాయాల రూపమే అంబేద్కరిజం. ప్రజాస్వామ్య సోషలిజాన్ని అంగీకరించేదే అంబేద్కరిజం. సామాజిక మార్పునకు చెందిన తత్వశాస్త్రమే అంబేద్కరిజం. జ్ఞానం, శీలం, కరుణ, మైత్రిల జంటన్ అంబేద్కరిజం. అశాశ్వతమైన నాస్తికత్వం, శాస్త్రీయ వాదంల పేరే అంబేద్కరిజం. విచక్షణ కలిగిన తెలివితేటలు వేగము, వాదన, హేతువాదాన్ని స్వీకరించడమే అంబేద్కరిజం. విశ్వజనీనమైన మానవ తత్వశాస్త్రమే అంబేద్కరిజం అంబేద్కరిజం అనగా నిజమైన విప్లవ తత్వశాస్త్రం.

అంబేద్కరిజం మానవీయ విలువలపై ఆధారితమైన మానవతా వాదమ్. ఆయన అలాంటి బలమైన హేతువాదం మీద నిలబడ్డారు. బుద్ధ తత్వశాస్త్రం దానికి మూలాధారం. అందువలన విజ్ఞానం విచక్షణా తిరుగుబాటు విశ్వసీయత ఇవన్నీ దారి లోపలి అవగాహన ధ్యేయం ఈ విధంగా అంబేద్కరిజం గుర్తించబడింది. బౌద్ధం లేకుండా అంబేద్కరిజంను ఊహించలేము. బౌద్ధాన్ని స్వీకరించడమే డా॥ అంబేద్కర్ తత్వశాస్త్రపు అభివృద్ధి ప్రక్రియ యొక్క ముఖ్యమైన సంఘటన.

ప్రముఖ అంబేద్కర్ వాద విమర్శకుడు యశ్వంత్, మనోహర్, అంబేద్కర్ వాద సాహిత్యం స్వేచ్ఛా సాహిత్యం. అంబేద్కర్ వాద సాహిత్యం, అసమానత బానిసత్వం సాంఘిక ఆర్థిక అన్యాయాలు, అన్ని రకాల దుర్మార్గాలు దోపిడీల నుండి మానవాళిని విముక్తం చెయ్యాలని భావిస్తుంది. మానవత్వపు విజయ పథాన్ని ప్రకాశవంతం చెయ్యడం, దానిని విస్తరింప చెయ్యడం దానిని శక్తివంతం, ప్రకాశవంతం చెయ్యడమే ఈ సాహిత్యం యొక్క లక్ష్యం అంటారు.

మరాఠీ దళిత సాహిత్యానికి ఆద్యుడు బలూత్ (అంటరానివాడు) అని మరాఠి ఆత్మకథా ప్రక్రియని ప్రారంభించిన దయపవార్ ఓ కవితలో

ఓ సిద్దార్థుడా
ఒక వేళ మేము విప్లవం తీసుకు వస్తే
మమ్మల్ని అందులో వదిలెయ్.....

అంటాడు

దళిత కవిత్వం అగ్రహారాల ఆయా వర్గాల ప్రజల ఆలోచనల్ని నింగి నుండి నేలకు దించి ఈ దేశ మూలవాసులైన అంటరాని పీడిత వర్గ ప్రజల పంథాల అసలు లక్ష్యాల్ని, నిర్దేశిస్తుంది. ప్రముఖ దళిత స్త్రీవాద రచయిత్రి ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విమల్ థోరాల్ "దళిత సాహిత్యం గురించి మాట్లాడుతూ దళిత విముక్తి పోరాటం కారణంగానే దళితుల్లో చైతన్యం కలిగింది. తమ హక్కుల గురించి వాళ్ళు ఆలోచించసాగారు. కుల నిర్మూలన కోసం మాట్లాడి విప్లవ చైతన్యం దళిత వర్గాల్లో నేడు నెలకొంది. అంటారు. ఈ యుగం సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన చర్చించాల్సిన విషయంగా దళిత సాహిత్యం మన ముందుకు వచ్చింది.

సామాజిక మార్పుని కోరుకునే సాహిత్యం దళిత సాహిత్యం. డా॥ అంబేద్కర్ దళిత సమాజంలో కొత్త చైతన్యాన్ని కొత్త చూపుని ప్రసాదించాడు. "ఆయన మా అంటరాని వారి హక్కులకు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడుతున్నారని, నన్ను దేశద్రోహిగా ఎందుకు చిత్రిస్తున్నారని కాంగ్రెస్‌ని ప్రశ్నిస్తాడు" ఒకచోట గాంధీకి సమాధానంగా అంబేద్కర్ "మీరు ఈ దేశాన్ని నా మాతృభూమి కాదు. ఏ దేశంలో కుక్కలు, పిల్లులు, జంతువుల కంటే హీనంగా చూడబడుతున్నాయో ఆ దేశం మాదెట్లా అవుతుంది అంటాడు. ఊరుమ్మడి చెరువుల్లో జంతువులతో పాటు దోసెడు నీళ్ళు కూడా తాగలేని స్థితిలో దళితులున్న ఈ దేశం మాదెట్లు అవుతుంది అంటాడు.

సాహిత్యం ప్రజల ఆలోచనల్ని ప్రతిబింబింప జేస్తుంది. ఉద్యమానికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ ఉద్యమ నేత కవి కత్తి పద్మారావు. సమాజంలో నెలకొన్న విభిన్నమైన విషయాల్ని సంఘటనల్ని సాహిత్యం బహిర్గతం చేస్తుంది. అలాంటి నేపథ్యంలోనే డా॥ కత్తి పద్మారావు సాహిత్యాన్ని, ప్రధానంగా కవిత్వాన్ని మనం చూడాలి.

కారంచేడు ఉద్యమ రణక్షేత్రంలోంచి పొడుచుకొచ్చిన కన్నమదాసు కోరవాలం డా॥ కత్తి పద్మారావు. ఆయన కవిత్వంలో హెూచిమెన్లు, పాబ్లో నెరూడాలు, గావీచ్‌లు ఫైజ్ అహ్మద్ ఫైజ్‌లు ముఖ్దూం మొహియుద్దీన్లు, శివసాగరు కల్కూరి ప్రసాదు, పైడితెరేష్‌బాబు, మద్దూరి నగేష్ బాబు, నాగప్పగారి సుందరరాజులు కనిపించి ఏడిపిస్తారు కచన రంగానికి పరుగులు తీయిస్తారు.

నేడు దళిత చైతన్యం సామాజిక అవలక్షణాల నుంచి సాంస్కృతిక బానిసత్వం నుంచి విముక్తిని పొందే దిశలో ముందుకు కదులుతోంది. ఆ చైతన్య స్థాయిని మనం కవి పద్మారావు కవిత్వంలో చూడాల్సి ఉంటుంది. సాహిత్య చరిత్రలో కవిత ప్రముఖమైన స్థానాన్ని ఆక్రమించింది. దళిత సాహిత్యంలో కూడా దళిత కవిత్వం ముఖ్యమైన స్థానంలో ఉంది. తెలుగు దళిత కవిత్వంలో డా॥ కత్తి పద్మారావు కవిత్వానికి ప్రత్యేకమైన స్థానం ఉంది.

మాకొద్దీ నల్లదొరతనం, అని గొంతెత్తి 'హరిజన శతకాన్ని" రచించిన కొసుమ ధర్మన్నని ఉద్యమ కవిగా తెలుగు దళిత సాహిత్య చరిత్రలో చెప్పాల్సి ఉంటుంది. తెలుగు దళిత కవిత్వంలో 'నిశాని' కవులుగా మన ముందుకు వచ్చిన పైడి తెరేష్ బాబు, మద్దూరి నగేష్ బాబు, ఖాజా వరదయ్య (లక్ష్మీ నరసయ్య)లు దళిత కవిత్వానికి కొత్త పలుకుబడిని అందించారు. సెంట్రల్ యూనివర్సిటీ నుండి దళిత మానిఫెస్టోల కోటను బద్దలు కొడుతూ నేటి నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్, డా॥ నాగప్పగారి సుందరరాజుల సంపాదకత్వంలో అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ దళిత సాహిత్య వేదిక నుండి ముందుకు వచ్చింది. "గుండె డప్పుల (1995) కవిత్వం. ఈ కవితా సంకలనం నుండి డా॥ కోయి కోటేశ్వర్ రావు, డా॥ చల్లపల్లి స్వరూపరాణి. డా॥బి.ఆర్. రత్నాకర్, డా॥ గుండెడప్పు కనుకయ్య, డా॥ నోతటి రవికుమార్ లాంటి అనేకమంది కవులు తెలుగు దళిత సాహిత్య చరిత్రలో తమ పేజీలని తాము వ్రాసుకొంటున్నారు.

తెలుగు దళిత సాహిత్యంలో 'జైలు గంటలు' మోగించుకొంటూ అగ్రహారపు గుండెల్లో నల్ల కలువలు పూయించి మాల మాదిగ పల్లెల్లో నీలి కేకలు సృష్టిస్తూ అంటరాని అణగారిన కులాల అవమానాగ్నుల్ని 'ముళ్ళ కిరీటంగా' ధరించి అంటరాని వారి, 'భూమి భాష'నే మాట్లాడుతూ 'కట్టెల మోపుని' నెత్తికెత్తుకొని 'ఆత్మ గౌరవస్వరం'తో ఉద్యమ స్ఫూర్తితో ఈ యుగకవిగా 'ఈ దేశం మాది' అంటూ ఈ యుగం కవిత్వాన్ని వినిపిస్తూ మన ముందుకు కవి కత్తిపద్మారావు దూసుకు వచ్చారు.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో చార్వాకులు, లోకాయతులు, శంతాకుడు, త్రిశంకుడు లాంటి పాత్రల్లో అంటరాని మనుషులు అనేకమంది కనిపిస్తారు. మానవ సమాజం క్షేమం కోరి ప్రజ్ఞ, సమత, కరుణ, అనే త్రిశరణాలను బోధించిన బుద్ధుడు నడయాడిన కల ఇది. భక్తి కాలంలో వచ్చిన సంత్ సాహిత్యంలో నిర్గుణధారకు చెందిన జ్ఞానాశ్రమ శాఖలో సంత్ కబీర్ సంత్ రవిదాస్, గురునానక్ విప్లవాత్మకమైన సాహిత్యాన్ని సృష్టించారు.

బాబా సాహెబ్ అంబేద్కర్ బానిసత్వాన్ని మించిన దుర్మార్గం ప్రపంచంలో ఎక్కడైనా ఉంది అంటే అది కులమేనని నినదించారు. అదే గొంతులు " ఈ దేశం మాది" అంటూ నినదిస్తూ కవిత్వం వినిపిస్తున్నారు. డా॥ కత్తి పద్మారావు ఈ కవితలో

**"ఆకాశ నక్షత్రాలు**
**సముద్రంలో అద్దం చూసుకుంటున్నాయి**
**సూర్యుడు సముద్రంలో**
**స్నానం చేసి తన బాల్యత్వాన్ని**
**నిరూపించుకొంటున్నాడు."**
**బౌద్ధ సాంస్కృతీ వికాసానికి**
**ఆ కవి కరణాలు**
**పతాకలెత్తుతున్నాయి**
**ఈ దేశం మాది**
**ఈ యుగం మాది**
**ఈ దేశ నిర్మాతలం మేమే అని**
**చాటి చెబుతున్నాయి.."** అంటారు.

మచో చోట ఆమె పాదాల నెర్రలు ఒక పునఃసృష్ట సంకేతాలు కవితలో

**"మీరు మానవ సంస్కృతి నుండి శిల్ప సంస్కృతికి**
**పరిణమిస్తున్నారు**
**అందుకే మీలో మానవతా**
**స్పర్శలేదు**
**అందుకే మళ్ళీ ఆ దళిత తల్లి**
**మానవతా పాఠశాల**
**అందులో విద్యార్థులం అవుదాం! రండి**
**అప్పుడే భారత దేశానికి**
**పునరుజ్జీవం"** అంటారు.

నేడు సమాజంలో వ్యాపిస్తున్న విష సంస్కృతిని, కుల హత్యలు, ప్రేమికుల పరువు హత్యల్ని ధిక్కరిస్తూ నిరసనగా ప్రేమదే విశ్వజనీన సూత్రం కవితలో కవి పద్మారావు

**" వివాహానికి కులం అడ్డుందని**
**ఏ దేవుడు చెప్పాడు?**
**ప్రేమ ఒక సంపద**
**సంపద కోసం**
**ప్రేమను చంపడ మెందుకు?**
**ఇక రాబోయేది**
**సంకెళ్ళు తెంచే కాలం**
**గోడలు కూల్చే కాలం**
**ప్రేమదే విజయం**
**ప్రేమదే విశ్వజనీన సూత్రం...** అంటారు.

మరోచోట

**"జీవితం ఒక మహాయానం**
**ఆ ప్రయాణంలో కడలి అలల్లోని**
**స్వరం మనకు వినిపిస్తోంది.**
**ఏవో ఉక్కు సౌధాలు**
**కూలుతున్న శబ్దాలు**
**మనకు వినిపిస్తాయి**
**బౌద్ధ రాజ్య ఆవిర్భావం కోసం**
**ఆత్మ గౌరవంతో ప్రజ్వలించాలి**
**అంబేద్కర్ పునరుజ్జీవన**
**ఆయుధకర్త "** అంటారు.

పుస్తకాలు చదివి చదివి లోకం కాలం గడిచిపోయింది ఎవడు పండితుడు కాలేదు. రెండున్నర అక్షరాల ప్రేమని చదువుకున్న వాడే నిజమైన పండితుడు అని ప్రపంచానికి బోధించిన కబీరు సతా మమత మానవతల ద్రోహుల్ని పరిచయం చేస్తూ ఒక చోట కవి పద్మారావు

అందుకే నేను కబీరు మానవతా గీతాన్ని వినిపిస్తున్న అనే కవితలో.....

**"ఆ పాట అర్థ శతాబ్దం నాడు మోగింది**
**ఇప్పటికీ వినిపిస్తూనే ఉంది**
**పాటు మబ్బుల్లో దాగుంటాయి**
**మనుసుల్లో పల్లవిస్తాయి**
**ఒక చిత్తు కాగితం మీద**
**నాలుగు అక్షరాలు**
**ఆ కవి గీసి వెళ్ళాడు**
**కవి గతించాడు కానీ పాట** వినిపిస్తూనే ఉంది.

ఆశయం లేని జీవితం
అర్థ రహితం
చలనం లేని జీవితం శిలతో సమానం
గమ్యం లేని జీవితానికి అర్థం లేదు
అందుకే నేను కబీరు
మానవతా గీతాన్ని వింటున్నాను
నాతో పాటు మీరూ వినండి
ప్రపంచాన్ని మేల్కొలుపుదాం....

అంటారు.

ఈ దేశంలో, సమాజంలోని కుల విష వృక్షాన్ని తెగ నరకాలనే తరాల యుగాల సంస్కర్తల విప్లవకారుల ఆశల్ని కలల్ని వెదుక్కొంటూ కవి పద్మారావు బొమ్మల కోసం చీకటి గుహలు వెదుక్కుంటున్నారు వారు అనే కవితలో....

**" ఆ కవి మంత్రాలకు తీరుద్దా?**
**అంబేద్కర్ బతికే వున్నాడు**
**చైతన్య వంతులలో**
**కనుకొల నుండి**
**అగ్ని వర్షం కురిపిస్తున్నాడు**
**ఆర్థిక సమస్యకు మూలం**
**సామాజికం సుమా!**
**కులం పునాదులు తవ్వకుండ**
**సమ సమాజం సాధ్యం కాదు**
**జై భీమ్.....** అంటారు.

భారతీయ దళిత కవిత్వంలో డా॥ కత్తి పద్మారావు కవిత్వం ప్రత్యేక శైలిలో కనిపిస్తుంది. అది దళితుల సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితుల దుర్మార్గాన్ని ఎండగట్టింది. తమ స్వార్థం కోసం ఆధిపత్య కులాలు ఆడుతున్న కపట నాటకాలు, దొంగ ప్రేలాపనలపై వ్యంగ్యాస్త్రాలు ఇందులో వున్నాయి. బట్టబయలు చేసింది. దళిత జీవన కోణాల్ని కవి పద్మారావు పరిస్థితుల్ని, మూఢనమ్మకాల్ని, విలువలు లేని తనాన్ని ఖండించింది.

వర్ణాశ్రమ ధర్మాన్ని అంటరానితనాన్ని తరాలుగా ఊరి బైట వెలిలో బతుకుతున్నా దళితుల మానవ హక్కుల కోసం నినదించింది. ఈ కవిత్వం దళిత జీవన విషాదాన్నే కాక భవిష్యత్ కాలను కూడా కోరింది. లేరా లేరా దళితుల యుగమిదెరా అన్నటువంటి పద్మారావు పాటలాగానే ఇది దళిత సాహితీయుగం.

ఈ దేశం మాది అంటూ ఈ నేలపై తనకొన్న హక్కుని, అనురాగాన్ని ఆధిపత్యాన్ని ప్రకటిస్తున్న డా॥ కత్తి పద్మారావు ఈ యుగకవి. ఈ కవిత్వం జనాదరణ పొందాలని కోరుకొంటున్నాను.

నా చిన్నప్పటినుండి మా ఒంగోలు ప్రాంతంలో వినిపించిన ఓ ధిక్కార స్వరం, ఉపన్యాసకారుడు, ఉపన్యాస సామ్రాట్ ఉపాధ్యాయుడు మహా మహోపాధ్యాయుడు దళిత పదాన్ని, అంబేద్కర్ వాదాన్ని కథలా వినిపించిన దళిత మహాసభ వ్యవస్థాపక నేత డా॥కత్తి పద్మారావు పై చదువులు సెంట్రల్ యూనివర్సిటీ చదువుతో పాటు పద్మరావుగారి నాయకత్వం ఆయన వచనలని చదువుకొంటూ ఆయన అనుభవాల్ని నేతృత్వాన్ని యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో పోల్చి చూసుకుంటూ నడిచినవాన్ని విద్యతో పాటు డాక్టరేట్ పొంది మరో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగినా పద్మారావుగారి తపన పట్టుదల, నాయకత్వం ఎప్పటికీ నాకు అర్థం కాని బ్రహ్మ పదార్థము. ఈ పుస్తకానికి ఈత కవిత్వానికి ముందు మాట రాయమని అవకాశమిచ్చిన గురువు గారు పద్మారావు గారికి కృతజ్ఞతలు



– డా॥ జి.వి.రత్నాకర్
7013507228

## పిల్లుల చేసిన మేలు
(కథ)

వీరమ్మ ఇంట్లో ఎలుకలు బాగా సందడి చేశాయి. ఆమె ఒక పిల్లిని, దాని బిడ్డను తెచ్చుకుని పెంచసాగింది. ఆ పిల్లిని చూసిన ఎలుకలు మాయం అయినాయి .ఆ పిల్లితోపాటు ఈ చిన్న పిల్లి కూడా ఆమెకు మచ్చికైనాయి. క్రమేపి ఆమె మాటలను కూడా అవి అర్థం చేసుకోసాగాయి. వీరమ్మకు తన సొంత పిల్లల కన్నా ఈ పిల్లులపై మమకారం ఎక్కువ. తన బిడ్డలు కనిపించకున్నా ఊరుకునేది కానీ ఈ పిల్లులు కనిపించకుంటే మాత్రం తల్లడిల్లి పోయేది .ఆ రోజు భోజనమే చేసేది కాదు. వారి ఇంటికి దగ్గరలో ఆమె బంధువులు ఉండేవారు .వారి ఇంటికి వీరమ్మ వెళ్లి వచ్చేది .ఆమె వెంబడి ఈ పిల్లులు కూడా వెళ్లేవి .ఒకసారి వీరమ్మకు కోపం వచ్చి ఆ పిల్లులను తన బంధువుల ఇంటికి వెళ్ళమంది .అవి అలాగే వెళ్లాయి. ఆ బంధువులు ఇవి వీరమ్మ పిల్లులు అని గమనించి వాటికి ఆహారాన్ని పెట్టారు. ఆమె కోపం తగ్గిన తర్వాత అవి తిరిగి ఇంటికి వచ్చాయి. వీరమ్మ వాటిని దగ్గరకు తీసుకుంది.

ఒకసారి వీరమ్మ ఏదో పనిమీద ఇంటి లోపల ఉంది. అప్పుడు వారి ప్రధాన ద్వారం తలుపుల దగ్గర పెద్ద పిల్లి హడావుడి చేయసాగింది. ఆ తర్వాత దానిని చూసి అక్కడికి వచ్చిన చిన్న పిల్లి కూడా గట్టిగా అరవసాగింది. అవి అలా ఎందుకు అరుస్తున్నాయో వీరమ్మకు అర్థం కాలేదు. ఆమె అక్కడికి వచ్చి ఆ తలుపు వైపు చూసింది. అక్కడ ఇంటి తలుపు జాలి వెనుక భాగంలో ఒక పాము తమ ఇంట్లోకి ప్రవేశించాలని చూస్తుంది . ఆ పాము బుసకొట్టుతూంది.దానిని చూసి ఆ పిల్లులు అరుస్తున్నాయి. అప్పుడు వీరమ్మకు అసలు విషయం అర్థమైంది. వెంటనే వీరమ్మ బయటి వారిని కేకలు వేసింది. వాళ్లు వచ్చేలోపనే ఆ పాము అక్కడి నుంచి వెళ్ళిపోయింది. "అమ్మయ్యా! ఈ పిల్లులు మనకు ఎంతో ఉపకారం చేశాయి "అని వీరమ్మ అనుకొంది.

మరొకసారి వీరమ్మకు చాలా జ్వరం వచ్చింది. అప్పుడు ఆ ఇంటిలో ఎవరూ లేరు. ఆ సమయంలో ఆమె భర్త పనికి వెళ్ళాడు .అది గమనించిన రెండు పిల్లులు ఆమె భర్త ఉండే చోటు వద్దకు వెళ్లి అరవసాగాయి .అతనికి మొదటి నుండి పిల్లులంటే కోపం. కానీ భార్య ముచ్చట కాదనలేక ఆమె పిల్లులను తీసుకుని వస్తే మౌనంగా ఉండిపోయాడు.

అవి అలా అరవడం చూసిన ఆయన అవి అలా ఎందుకు అరుస్తున్నాయో తెలియక ఇంటికి వచ్చి వీరమ్మను కేకలేద్దామని తన ఇంటికి వచ్చాడు .వీరమ్మ చలి జ్వరంతో గజగజ వణికి పోతుంది .అప్పుడు అతనికి ఈ పిల్లులు ఎందుకు అలా అరిచాయో అర్థమైంది .ఎప్పుడు తను ఉండే చోటుకు రాని ఈ పిల్లులు ఈరోజు ఎందుకు వచ్చాయో అతనికి తెలిసింది .అతడు వెంటనే వైద్యుని తీసుకుని వచ్చి వీరమ్మకు చికిత్స చేయించాడు. ఆమె రెండు మూడు రోజుల తర్వాత కోలుకుంది. ఆమె భర్త కూడా అప్పటి నుండి ఈ రెండు పిల్లులను తన కన్న బిడ్డల వలె చూసుకొనసాగాడు. ఆ పిల్లులను వారు తిట్టినా అవి మౌనంగా ఉండేవి తప్ప ఒక్క వస్తువును పాడు చేసేవి కావు . "ఆహా !ఈ మూగజీవులకు ఎంత జ్ఞానం "అని వీరమ్మ, ఆమె భర్త ఆశ్చర్యపోయేవారు.



–సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

## జీవితమనే కఠిన శిలను మోస్తూ..!!

జీవితమనే కఠినమైన శిలను మోస్తూ
వేస్తున్నాము ప్రతి అడుగు అస్పష్టంగా
దారి కనపడని రహదారిలో సంతృప్తిగా
బరువును గౌరవంగా స్వీకరిస్తున్నాము..

కష్టాల సుడిగుండంలో గానుగెద్దులా తిరుగుతూ
అక్కడక్కడే తిరుగుతూ అల్లుకుపోయాం
తనువుకు విశ్రాంతి మనసుకు శాంతి లేకుండా
ఆశల గంపలు మస్తిష్కంలో మోస్తున్నాం..

కాలం చేస్తూనే ఉంది దారి చూపకుండా
కురుక్షేత్ర యుద్ధంలో దాయాది మనుషులం
ధర్మం అధర్మం లెక్కలేస్తూ చూపిస్తూ
రెండు కాళ్లకు ముందర బంధం వేస్తున్నారు..

హృదయం గాయానికి కారం చల్లుతూ
తేనెటీగల గుంపుల చుట్టూ తిరుగుతూ
బంధాలను ఉల్లి పొరల్లా తొలగిస్తూ
అనుబంధాలను కుంపటిలో కాలుస్తున్నారు...

అలల తాకిడిలా నటనలు చేస్తూ
హృదయాన్ని తాకి వెనుదిరిగి పోతూ
పాదాలు తడిపి హృదయాన్ని ఎండగడుతూ
కంటికి దగ్గరగా మనసుకు దూరమయ్యారు..

నింగిలో ఆశల పళ్ళెము నిండా కోరికలు
సూర్యోదయపు వెలుగులో చీకటి ఛాయలు
రేయింబవళ్ళు జీవిత చక్రం తిరుగుతుంది
గ్రహణాలను తప్పిస్తూ సాగిపోతూ ఉండాలి..



–కొప్పుల ప్రసాద్
9885066235

పుస్తక సమీక్ష

## 'తెలుగు మహా సభలు-2017' దాసరి శాంతకుమారి సమగ్ర గ్రంథం

తెలంగాణ సాహిత్య కళా పీఠం అధ్యక్షురాలిగా, దాసరి శాంతకుమారి (జంగిటి) ప్రతిష్టా త్మకంగా, వైభవోపేతంగా నిర్వహించబడిన ఐదు రోజుల ప్రపంచ తెలుగు మహాసభల విశేషాలను విషయ వాఙ్మయ దీపికగా కన్నులకు కట్టినట్లుగా వివరంగా పొందుపరి చారు. భవిష్యత్ సాహితీ అభిమానులకు తెలుగు మాతృ భాషపట్ల ఆదరాభి మానాలున్న వారందరినీ ఈ పుస్తకం అలరిస్తుంది. తెలంగాణ, జాతియ తెలుగు భాషా సాహితీ, సంస్కృతీ వికాసానికి అందించిన మహత్తర చారిత్రక వైభవాన్ని రచయిత్రి తన స్వీయ అనుభవాలు, వివిధ సభల సాఫల్యాలను ప్రస్తావించి ఆవిష్కరించారు. వివిధ వేదికలపై కార్యక్రమాలు, మీడియా వార్తాంశాలు, పాల్గొన్నవారి అనుభవాలు, అనుభూతులను రచయిత్రి అక్షర రూపంగా నివేదికగా రికార్డు చేసారు. 57 ప్రకరణలువున్న ఈ పుస్తకంలో మహసభల ఉద్దేశ్యాలు, లక్ష్యాల నుండి, మరువలేని జ్ఞాపకాల వరకు కార్యక్రమాలు, ప్రకటనలు, ప్రదర్శనలు, సమావేశాలు, విందు వినోదాలు, కళాత్మకాలు, గ్రంథావిష్కరణలు ప్రముఖుల స్పందనలు, ఉపన్యాసాలు, మనోగతాలు, ఇంటర్వ్యూలు, పోటీలు, సదస్సులు, సన్మాన సత్కారాలు 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు మహాసభల సర్వస్వం విషయ సేకరణకు ఏ విధంగా రాజీపడకుండా శ్రమించి అక్షర రూపంగా పుస్తకం ప్రచురింప చేసారు. "తెలంగాణ గుండె నిండుగ తెలుగు పండుగ" నాటి విజయో త్సవ వేడుకలను ఎంతో






శ్రద్ధాసక్తులతో, ఒంటి చేత్తో యింత సమర్థవంతంగా, నమోదు చేసి రచయిత్రి శాంతకుమారి తెలుగు సాహిత్య కళాపీఠం సిద్ధిపేటను శిఖరాగ్రంపై నిలబెట్టారు.

**ప్రతులకు:** శ్రీమతి దాసరి శాంతకుమారి
ఇ.నెం. 18–13–78,
గాంధీనగర్, సిద్దిపేట.
సెల్: 9652483644



–జయసూర్య
సెల్:9014948336
9394775088

## నేను చూసాను

నేను చూసాను,
వీధి చివరన చెత్తకుప్పలో తిండికోసం
వెతుక్కుంటున్న చిన్ని బాలున్ని,
అదే వీధిలో అందమైన భవంతిలో
అమ్మ పెట్టిన అన్నం ముద్ద ఎక్కువై
విడిచి పెట్టిన మరో బాలున్ని..

నేను చూసాను,
కాలనీ క్లబ్బు మైదానంలో
తెల్లని దుస్తుల్ని ఎక్కడెక్కడో రుద్దుకుంటూ
కావాలనే మాపుకుంటూ
ఆటలాడుతున్న అందమైన బాల్యాన్ని,
ఒంటికి చొక్కా ,
కాలికి చెప్పు లేకుండా ఆశగా
ఆ ఆటనే చూస్తూ
నిరాశ పడుతున్న మరో
చిన్నారి లోకాన్ని...

నేను చూసాను,
ఒక చేత్తో బోరింగ్ కొడుతూ
ఇంకోచేత్తో నీళ్ళు తాగుతున్న వీధి బాలున్ని,
బోరింగ్ పంపు ముందున్న ఇంటిలో
మినరల్ వాటర్ తాగుతున్న మరోబాలున్ని...

నేను చూసాను,
అందమైన బంగళాలో ఏసీ రూములో కూర్చుని
చదువుకుంటున్న చిన్న పిల్లాన్ని..
అదే ఇంటిముందు
మరో నిర్మాణానికి మండే ఎండలో
తల్లితో పాటు రాళ్లెత్తుతున్న మరో పిల్లాన్ని..

నేను చూసాను,
బడినుండి రాగానే అమ్మ పెట్టిన అట్లు తింటున్న
ఒక బాలికని..
అదే ఇంట్లో ఆ పాప విడిచిన బట్టలుతుకుతూ
తిని పారేసిన అంట్లు కడుగుతూ
తిట్లు తింటున్న
మరో చిన్నారి చిట్టి తల్లిని...

నేను చూస్తున్నాను
తేడాల్ని బేధాల్ని,
నేను వింటున్నాను
నవ్వుల్ని రోదనల్ని...

బాలల బతుకుల గ్రహణాన్ని తొలిగించి అందరిలా
ఏకరీతి వ్యవస్థకు
చేయి చేయి కలుపుదాం
రేపటి భవితకు వారే ఆశ జ్యోతులు.



-వి.శేషారావు
9440408080

## కష్టాల కవచం

కాలంతో కుస్తీపడటం అంటే ఒక యుద్ధమే
రోజురోజుకు నన్నునేను కుబుసం విడిచిన
పాములా మార్చుకొని విహరిస్తున్నాను.
కోరల్లో విషముంటే సరి...
కానీ నా తోటివారికి ఒళ్ళంతా విషమే.
ఎక్కడో కొమ్మమీద కూర్చొని కోకిలమ్మ
కష్టాల గానాన్ని ఆలపిస్తుంది.
నాతో జాతకూడి బాధల హృదయాన్ని
పంచుకోవాలని చూస్తుంది.
పాపం..కోయిలకు కూడా తెలుసు.. మనిషి
ఒంటరిగా మిగిలిపోయి విలపిస్తున్నాడని.!
తీరం తీరాన తీరని బాదలను తలచుకుంటూ..
కన్నీటిని సంద్రంలో కలిపేస్తున్నాను.
సాగరం అలలై తాకుతూ నన్ను ఓదార్చుతుంది.
కన్నీరును తనలో కలిపేసుకొని..
గుండె గర్భంలో గుమిగూడిన గాయాలను
తన చల్లని నీటితో తడిపేస్తుంది.
చీకటిముసిరిన జీవితానికి కొన్నివెలుగు రేఖలు
అందుతాయని సూర్యున్ని అదేపనిగా
తలచుకుంటున్నాను.
కష్టాలన్నీ నా చుట్టూ కవచాలుగా మారి..
నిశీధిలోనే నన్ను బందించేశాయి.
రవికిరణాలు నన్ను చేరేదెపుడో.
ఉషోదయాన అల్లుకున్న మంచుతెరల్లా..
తాకిచూస్తే అంతా ఉట్టి మాయే.
ఆనందం ఆవిరై ఎదో ఉహాలోకపు విశ్వంలో
జీవిత నావ ప్రయాణిస్తుంది.
కొన్ని వానచినుకులన్నీ కురిసి
గొంతును తడిపే సమయం రాకపోదా అని..
కష్టాల కవచం బద్దలై భానుడి వెలుగులు
నను చేరకపోవా అని ఎదురుచూపు.



–అశోక్ గోనె
9441317361

## సనాతన ధర్మం

మాతృదేవోభవ, పితృదేవోభవ
ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ
అన్నది మన సనాతన ధర్మం,
'మాతృదేవోభవ...'
ఇలలో తల్లిని మించిన దైవం లేదు,
తన రక్త మాంసాలతో బిడ్డను సృష్టించి
జన్మను ప్రసాదించి
కంటికి రెప్పలా కాపాడుతూ
పెంచి, పోషించి, రేపటిపౌరుడిగా
తీర్చి దిద్దడంలో తల్లి పాత్ర సుస్పష్టం,
మరి అలాంటి మాతృమూర్తికి
వృద్ధాప్యంలో బిడ్డ ఆదరణ ఎక్కడ?
నేటి సమాజంలో ప్రతి ఇంటా
వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్య ఇదే,
'పితృదేవోభవ'.....
బిడ్డ ఎదుగుదలకు
ప్రతీక్షణం ఆరాటపడుతూ ఉన్నతికి
బాటలు వేసిన
అలుపెరుగని యోధుడు తండ్రి,
అలాంటి తల్లిదండ్రులను
గౌరవించడం ప్రతీ బిడ్డా
బాధ్యతవహించి గౌరవించడమే
తల్లిదండ్రులకు అగ్రతాంబూలం...!
తల్లిదండ్రులను ఆదరించడమే
అసలైన ఆధ్యాత్మికత,
మరణించిన తరువాత వాళ్లకు
విగ్రహాలు కట్టించడం...
ఫోటోలకు దండలు వేయడం
కర్మకాండలు ఆడంబరంగా
నిర్వహించడం గొప్పకాదు,
వారు జీవించి ఉన్నపుడే
తోడు, నీడగా ఉండి కంటికి
రెప్పలా కాపాడుకోవడమే
మన సనాతన ధర్మం"



–రాయవరపు సరస్వతి
7989665525

# చిక్కటి కవిత్వం "తిరిగిరాని ప్రేమ"

పుస్తక సమీక్ష






సాహిత్యంలోని కవిత్వాన్ని ఎంచుకొని మొదటి కవితా సంపుటి లోనే అందరినీ ఆశ్చర్యపరిచే రీతిలో తన అనుభవాలను కవిత్వ భాషలో చెప్పి హృదయ సంవేదనలను కవిత్వంతో పంచుకుంది అన్నారానికి చెందిన కవయిత్రి బోడ మానస ,"తిరిగిరాని ప్రేమ" పుస్తకంలో చిక్కటి కవిత్వాన్ని అందించింది.

ఇందులోని ప్రతి కవిత మనతో మాట్లాడుతుంది మన ముందర దృశ్యం కదలాడినట్టు భావాల చిత్రీకరణ పదాల పొందిక చిత్రమై కనిపిస్తుంది. మన చుట్టూ ,అంశాలే మన దృష్టికి రాకుండా ఉండి మానస గారి కవిత్వంలో అలరించే అంశమై భావగీతమస్పందింపజేస్తున్నాయి

తిరిగిరాని ప్రేమ పుస్తకంలో.

మొదట ఈ పుస్తకంలో. కొన్ని నానీలు ఉన్నాయి ప్రతి నాని కూడా , హృదయ లోతుల్లోంచి ఆలోచనగా మారి ఘర్షణ పడి కలం నుండి జాలువారిందే సృజనా త్మకత ను ఈ నానీలో ప్రతి చోటా మనం చూడవచ్చు.

**భూమిలో**
**విత్తనం నిద్రిస్తుంది**
**పిడికెడు గుండెలో**
**కొండంత బాధలా ...**

**పిడికెడు గుండెలో కొండంత బాధలా** ....అంటూ ఎంత బాధ అయినా గుండెలో ఉండాల్సిందే. ఆ గుండె ఎంత భారాన్ని మోయాలి. దీంట్లో ఉపమానము పోలిక ఎంతో బాగా సరిపోయింది. చిన్న వాక్య మైనా ఎంతో ఆలోచింపజేసే వాక్యం ఇది.

**తన పుస్తకం పై**
**చెమట చుక్కలు**
**కురుస్తున్నాయి**
**కవిత్వంలో మారడానికేమో ?**

కాగితం పై రాస్తున్నప్పుడు చెమట చుక్కలు కురవడం మామూలే కానీ ఆ చెమట చుక్కలు కవిత్వంలా మారతాయేమో ... అనడంలో కవయిత్రి చైతన్య బలం కలం బలాన్ని ప్రయోగించింది . చెమటకారిస్తేనే అద్భుతం. చెమట కారితేనే విజయం. చైతన్య జీవం చెమటనే కదా.... కాలచక్రం చెమటనే.

చమక్కులు ఆలోచింపజేసే పదాలు మదనపడితేనే మేధస్సుల్లో మెరుస్తాయి. ఆలోచనలతో మనం నల్లటి మేఘాలమైతేనే. కవిత్వం చమక్కులు కురుస్తాయి. కవిత్వ వంట వండుతుంది . అలా ఆలోచింపజేసే ఇంకొక గొప్ప నాని ని ఈ పుస్తకంలో చూడవచ్చు

మా నాన్న
చెమట చుక్కలని
తల స్నానం చేసింది
మా పొలం.

రోజూ పొలం చుట్టూ తిరుగుతాము అన్నీ చూస్తాము. కానీ, కవిత్వం పుట్టదు. కానీ, ఆలోచిస్తే, మదనపడితే, తపన పడితే, ప్రతి వస్తువులో కవిత్వమే. కవిత్వ మనసు ఉండాలి. కవిత్వ చైతన్య కాంతి చూపు ఉండాలి.

నాన్న రోజు కష్టపడి కారుస్తున్న చెమటలతో పొలం తలస్నానం చేసిందట. ఎంతటి బాధతో, మనసును పలకరించిన పదాలివి.

నాన్న చిలకరిస్తున్న చెమటలను గమనించి, గమనించి , ఏద లోతుల్లోంచి తన్నుకు వచ్చిన పదాలు ఇవి. లోతుగా ఆలోచించిన కవి దృష్టి ఎన్నో ,భావాలను చిత్రీకరించ గలదని నిరూపించిన నాని ఇది.

బోడ మానస గారి వయస్సు చిన్నదైనప్ప టికి కలం పడితే ఎన్నో కవిత్వ భావాలు స్పందనలై కాగితంపై సాగిపోతున్నాయి. ఆలోచింపజేసే కవిత్వమై అందరినీ అలరిస్తున్నాయి. మానస గారి ఈ పుస్తకంలో ఆలోచింపజేసే కవిత్వ పదాలు ఉన్నాయని తెలపడానికి ఈ చిన్న నాని లో ఉన్న భావాన్ని చూడండి.

భూమి కొనుగోలు
ఎక్కువైనది
రైతులే
కరువయ్యారు.

ఈనాటి సమాజంలో భూమి చుట్టూ, తిరుగుతున్న రియల్ ఎస్టేట్ , డబ్బులు, మోసాలు ,భూమి చుట్టూ జరుగుతున్న ఎన్నో అకృత్యాలు, అన్యాయాలు, , భూమి ఒక్కటే ,సంపదను పంచి పెడుతున్న సందర్భంగా పెరిగిపోతున్న భూమి కొనుగోలు, అమ్మ కాలు. బలి అవ్వ.తున్న అమాయకులు ,భూ కబ్జాలు ,ఇవన్నీ, సమస్యలను ఉదహరించి రాసిన నాలుగు పాదాలు ఎంతగానో ఆలోచింపజేస్తున్నాయి . భూమి కొనుగోలు ఎక్కువైంది సరే ,వాటిని కొనేది రైతులు కాదు ,రియల్ ఎస్టేట్ వ్యాపారులు ,బడాబాబులు అందుకే ,కవయిత్రి రైతుల వైపు నుండి ఆలోచించింది ఈ నానిలో కవయిత్రి రైతుల గోసను తన పదాల్లో రాసింది భూమి అమ్ముడైన తర్వాత రైతుకు నీడ ఏది , భరోసా ఏది,? రైతు భవిష్యత్తు ఇంకేముంటుంది? రైతుకు ఆధారమేముంటుంది? రైతుకు భూమి కదా అసలు ఆధారం అది లేకుంటే రైతు బతుకు, ఊపిరి ,ఆగినట్టే కదా ? ఈ రైతు జీవితం గురించి ఇంకో నాని లో

**నమ్ముకొని**
**బ్రతికేది రైతు**
**అమ్ముకునేలా**
**చేసేది కాలం.** అంటుంది కవయిత్రి

ఈ నానీల్లో ఎన్నో నానీలు చిన్న పదాలతో బహు విచిత్రమైన కోణాల్లో మనసులకు తాకి నిజమే, అన్నట్టు మన ఆలోచనను సూక్ష్మ కోణం వైపు నడిపిస్తాయి. ఆశ్చర్య పడేలా చేస్తాయి .ఇవి కవయిత్రి పరిశీలనా శక్తికి నిదర్శనంగా మనకు కనిపిస్తాయి.

**పెదాలపై నవ్వు**
**రాలిపోదు**
**ఎందుకంటే**
**పెదాలకి ఏడవడం తెలియదు కదా ?**

మోము పై నవ్వును చూస్తాం కానీ ,పెదాలపై నవ్వు బాధొచ్చిన కష్టమైన ఇష్టమైన ఒకే విధంగా ఉండడం గమనిస్తాం .పెదాల బలహీనత మంచి మనసున్న వ్యక్తికి కవయిత్రి ఆపాదించారు. పెదాలపై నవ్వు రాలిపోదు బహుశా ,స్త్రీ పడే కన్నీటి వేదనను ఎన్నో కష్టాలను పంటి బిగువున దాచుకొని పైకి నవ్వుతూ తన బాధలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించే స్త్రీ వేదన రూపంగా ఈ నాని ఉద్భవించిందని చెప్పవచ్చు.

ఈ పుస్తకంలోని కవితలలో "గొప్పవాడు నాన్న" కవితలో మానస గారు తన నాన్నను, నాన్న పడుతున్న కష్టాన్ని, బిడ్డగా కవిత్వాకృతి కల్పించింది.

అక్షరాలతో నాన్న కష్టానికి అర్చన చేసింది.

**"ఎప్పుడూ ,ఏదో ఒక ఒత్తిడి తనలో**
**మంచు ముక్క లా....**
**ఒంట్లోని శక్తిని కరగదీస్తుంది**
**అలసిన బతుకు మీద**
**ఇన్ని కన్నీళ్ళ ?"**అని ప్రశ్నిస్తుంది.

ఈ కవితలో నాన్న మీద ప్రేమ కనిపిస్తుంది కానీ ,కవిత్వ భాషలో చాలా చక్కగా ఆ ప్రేమను వర్ణించగలిగింది. అందుకే మానస గారి కవిత్వంలో అన్ని సున్నిత భావాలు పదాలతో నిండిపోయాయి . సృజనాత్మకత తోడయ్యి నిలిచింది. భావాల పరుగు ప్రతి కవితలో కనిపిస్తుంది కవయిత్రి సున్నిత మనసు , చలించిన మనసు , సున్నిత భావాల పదాలలో కనిపిస్తుంది. కవిత్వ భాష పోలిక పదాలు నిండుగా ఉన్నాయి.

**అమ్మ పడిన కష్టాన్ని తలుచుకుంటూ, "మా అమ్మ" కవితలో**
**పనికెళ్లొచ్చిన పైసలు రాగానే**
**రంగులు అద్దిన మూగ బొమ్మలను తీసుకొచ్చి**
**నా పెదవులపై**
**చిరునవ్వులను అంటించే దానివి** అంటూ అమ్మ ప్రేమను ఎంతో కవితాత్మకంగా చెప్పింది.

ఇలా ఈ పుస్తకంలో కవిత్వ భాష ,వరుగులు పెట్టింది .సుకుమారాల లాలిత్యం పదాల సొగసై భావాల ,పరంపరై ముందుకు సాగింది.

పుస్తకం చదువుతున్నంతసేపు కవయిత్రి ప్రతిభ ప్రతిపాదంలో కనిపించి ఒక వస్తువును ఇలా పోల్చవచ్చా.? ఇలా వ్యక్తీకరించ వచ్చా? అనే ఆశ్చర్యార్థక భావాలు ఎన్నో ప్రతి కవితలో కనిపిస్తాయి.

ఇది మానస గారి మొదటి పుస్తకమైనా, పరిణితి కలిగిన మంచి కవిత్వం. నిజమైన మేలైన కవిత్వం .ఈ పుస్తకంలో మనం చూడవచ్చు. ఈ పుస్తకంలో మానస గారు రైతుల వెతలను చెప్పారు . అమ్మ ప్రేమను ,తాత ప్రేమను, నాన్న ప్రేమను ,సామాజిక సమస్యలను చెప్పారు.

ఈ పుస్తకం నిండా ఉపమానాల ప్రవాహం సాగింది. ప్రతి కవితలో ఎన్నో పోలికలు కలంతో పోటీపడ్డాయి. నిత్యజీవితంలో జరిగే విషయాలు కవిత్వమై ఆలోచింపజేశాయి.

పోలికలు కవి భావన శక్తికి ప్రతీకలు భావన ఎంత దూరం వెళితే అంత చిక్కనైన పోలిక సమాంతరంగా రూపొందించబడుతుంది.

ఈ పుస్తకం కవిత్వ పూదోటగా పరిమళాలను వెదజల్లింది .సున్నిత సుకుమార భావాలు మనస్సును తాకి కవిత్వ ఒడిలో సృజనాత్మక హాయిని అందించాయి . ప్రతి వాక్యంలో కవిత్వం తప్పనిసరిగా తొంగి చూసింది. ప్రతి మనసును మీటి అందరినీ మానవత్వమై పలకరించింది.

సృజనాత్మకత తోడై భావాల పుష్పాల హారాలను చదివిన ప్రతిపాఠకుడికి అందిస్తుంది.

ఈ పుస్తకం నానీల భాషగా పులకించింది. ఆలోచన బంధమై పెనవేసింది. కవిత్వ ఒడిలోకి చేర్పించింది అనడంలో అతిశయోక్తి లేదు.

ఇవి మదనపడిన అక్షరాలు. సున్నిత భావాలతో హృదయం నుండి ఉప్పొంగిన సృజనాత్మక ఆలోచనలు . వస్తువు పాతదే అనిపించిన పోలిక మేధస్సు పడిన సంఘర్షణ కొత్తగా కనిపిస్తుంది .ప్రతిచోట ప్రతి అంశంలో కొత్త సృజనాత్మకత తోడై నిలిచింది.

భావాల అలజడిని ఆలోచనల సవ్వడిని అక్షరాల ఒరవడిని నూతన అభివృద్ధి సాధనంగా కలాన్ని ఈ కవిత్వంలో గుర్తించవచ్చు.

నిత్య సంఘర్షణ నిత్య సంఘటనల అనుభవమై మండిన అక్షరాలు పొంగించిన ప్రేమలో అనుబంధాలు బంధుత్వాలు కవిత్వ రూపమై మనసులను తడి తడిగా తాకింది.

మొత్తానికి తిరిగిరాని ప్రేమ కవితా ప్రవాహమై సాగింది . ఉపమానం పోలిక కవయిత్రి బలమైన భావన శక్తికి నిదర్శనంగా నిలిచింది .సృజనాత్మకత వర్ణనా శక్తి అడుగడుగునా కనిపిస్తుంది .ప్రతి కవితలో అనుబంధాలు ఆత్మీయత మానవీయత పదాల ప్రేమలో దాగిపోయాయి.

**సందేశాలు సౌరభాలై గుబాళించాయి**
**చెమట చుక్కలు కవితా అక్షరాలై మెరిశాయి**
**నిత్యజీవిత వస్తువులు భావన సంఘర్షణలై మదనపడ్డాయి .**

ఇది చాలా చక్కటి చిక్కటి కవిత్వంగా "తిరిగిరాని ప్రేమ" పుస్తకాన్ని అందించిన మానసబోడ కవయిత్రి గారికి శుభాభినందనలు తెలియజేసుకుంటూ కవిత సాహితీ ప్రపంచంలో ఆహ్వానిస్తూ ఆమె పుస్తకాన్ని ఆదరించవలసిన అవసరం అందరిదీ ఉందని తెలియజేస్తున్నాను

**ప్రతులకు:**
మానస బోడ. కవయిత్రి.
అన్నారం గ్రామం
మాచారెడ్డి మండలం
కామారెడ్డి జిల్లా, తెలంగాణ
పుస్తకం ధర.50.
సెల్ 7702101895.



- సమీక్షకులు
-సిరిసిల్లా
గఫూర్ శిక్షక్
9849062038

## వస్త్రం అస్త్రం

మా వూల్లో సాలోళ్ళు మగ్గాలపై
ఏనుగుల పిట్టల డిజన్లు
నిలుంబాక కలుపుతూ
సీతగీతల చుక్కలు సట్టాలతొక్కుళ్ళు ,
రాట్నం తిరుగుళ్ళు
కండె ఉరుకులాటలు
సప్తవర్ణాల చీరెల్ని నేసెటోళ్ళు
ఇంటింట సందళ్ళ సంగీత సరాగమే.!
దారపు పోగులల్లికయే
చేనేతలకలంకారమై ఆనందాన్నిచ్చేది
ఆహ్లాదాన్ని పంచేది...!
తాతల భుజంపై ఓ కండువా
మెరుపు అంచులరంగులతో
తెల్లని దోతుల దర్జా
ఎంతో హుందాగుండేది ఆనాడు ...!
బయటికెల్తె కండువా
తెల్లని పంచెలో
దొరతనముట్టి పడెలా
ఆనాటి పటాటోపం..అబ్బో...!

దొరలు,కర్ణాలు, పట్వారులందరి
వస్త్ర విశేషమంతా
దుస్తుల్లోనే దార్శనికతంతా..!
కిర్రుకిర్రు చెప్పులు
చేతులకు వెండితొడుగులు
చేతిలోకర్ర పట్టుకొని
ఊళ్ళె అడుగులేస్తుంటే ఎవరైనా
దండం దొరా అనాల్సిందే..
ఆ దర్జాకు.!
ఖద్దర్ ఖదర్నాక్ నాగరికం...!
వందేమాతరమే దానికి పెద్దరికం...!
రైతు భుజాన ఎర్ర రుమాలు
వీడని నేస్తమై
అరకతో శ్రమిస్తూనే ఉంటుంది..
ఆకలి తీరినాక చేతులు
తుడుచుకోడానికి తుండు గుడ్డగా
అలసటతీర్చుటకు సిరిసాపయ్యేది...!
బస్తీ నడకలో సంకల జేరి
పెద్దలకు మర్యాదిచ్చేది...!,
దుఃఖమొస్తే కన్నీళ్ళను తుడిచేది
తుమ్ముల దగ్గులకు
దాపరికం నేర్పేది...!
మాస్తే మసిగుడ్డె
చీకిపోతే అల్కు పిడసై

నాగరికతను నేర్పిన వస్త్రం
జీవిత పరమార్థాన్ని దిద్దే అస్త్రం..!
బతుకు రాట్నంలో దారం
ఆధారమై ప్రాణానికి మానమై..
మాటలో భాగ్యమై...
మనిషితో స్నేహంచేసిన వలువలు
విలువలు మరువక
మట్టిలో,చితిలోనైనా చిరుగకుండ
మనిషిని విడలేనంటూ
ఆత్మత్యాగాల కన్నీటి వలపోతలో
అగ్నిమంటల్లో కాలిపోతూ
పంచభూతాల్లో కలిసి పోయె
తీపిగుర్తుల్ని
రేపటితరం నెమరేసుకొమ్మంటూ ......!



-డా.పాండాల మహేశ్వర్
9912180054

## శ్రమ నీదైతే ఫలితం ముంగిట వాలును..!

అవమానం జరిగిందని
నిరాశ చెందబోకు..!
నిరాశ చెందినచో
గమ్యం చేరుకోలేవు..!!

అడ్డంకులు వచ్చాయని
అధైర్య పడబోకు..!
అధైర్య పడినచో
అనుకున్నది సాధించలేవు..!!

అవహేళనలు చేశారని
అక్కడే ఆగిపోకు..!
అక్కడే ఆగిపోతే
వాళ్ళకి బుద్ధి చెప్పలేవు..!!

తోడు అందించలేదని
నిందలు వేయబోకు..!
నిందలు వేసుకుంటుంటే
సమయాన్ని కోల్పోతవు..!!

ప్రోత్సహించ లేరని
పగను పెంచుకోబోకు..!
పగను పెంచుకుంటే
ప్రమాదమునకు గురవుతవు..!!

పైవన్నివి కారణాలనుకుంటే
పైకి ఎదుగలేవు సోదరా..!
ప్రగతికి సోపానాలనుకుంటే
ఫలితం పొందగలవు సహోదరా...!!



-పసుల.శంకర్
9542181301

## స్నేహం

మృదువైన మాటలు మనుషుల మధ్య
స్నేహాని పెంచుతాయి,
అలాగే కఠినమైన మాటలు
మనుషుల మధ్య
దూరాలు పెంచుతాయి,
మిత్రత్వం,శతృత్వం అంతా
మన మాటలు ప్రభావమే,
కనుక మాటే మాణిక్యం,
దాన్ని పొదుపుగా వాడుకో,
సంతోషాన్ని మించిన సంపదలేదు,
ఆరోగ్యాన్ని మించిన ఆస్తిలేదు

చిరునవ్వును మించిన ఆభరణం లేదు,
స్నేహితుని మించిన ఆప్తుడు లేడు
తల్లిదండ్రులను మించిన దైవం లేదు,
ఈ ప్రపంచంలో
మనం కొనుక్కోలేనిది స్నేహం,
దీన్ని సంపాదించుకోవాలే గానీ
పేరుతో గానీ డబ్బుతో గానీ
పరపతితో గానీ కొనుక్కోలేము,
అది నిజాయితీగా నువ్వు చేసే
పనుల వలనే సాధ్యమవు తుంది"



-రాయవరపు సరస్వతి
7989665525

## నానీలు

డాక్టరై
ప్రజాసేవ చేస్తానన్నాడు
ఇప్పుడతనికి
డబ్బు జబ్బు.

గురువంటే
చదువు బరువే కాదు
జీవన విలువల
బ్రతుకు తెరువు.

బతుకుతోటలో
నీ సందడి
పరిమళంతో
పసిగట్టేస్తాను

మనసు నిండా
సంఘర్షణలు
మొహంలో మాత్రం
నవ్వుల దివ్వెలు



-ఎన్. లహరి
9885535506

## భవితను తేల్చేది గురువే

తానే ప్రశ్న తానే సమాధానం
అదే గురువు గొప్పదనం
మెదళ్ళను తొలచి
విద్యార్థులను మలిచి
అక్షరాల బీజాలు వేసి
పలు శిక్షణలతో
మహా వృక్షాలు చేసే
తోటమాలి అతడు.

ప్రతిఫలం ఆశించని తరువు
ప్రయత్నం చేస్తే చాలనుకునే ఆశాజీవి
సుద్దముక్కతో భావితరాలకు
నల్లబల్లపై దారులు వేసే దార్శనికుడు.

మూరెడు బెత్తంతో
తప్పును తప్పుగా
ఒప్పును ఒప్పుగా
నిర్భయంగా చెప్పే ధీరుడు అతడు.

సమయ పాలన విలువ తెలిసిన
సమోన్నత వ్యక్తి...
స్వయంగా చేయాలని చెప్పి
గురుతర బాధ్యత గుర్తు చేసే వ్యక్తి.

బ్రహ్మ రాతరాస్తే
అమ్మ జన్మనిస్తే
జన్మరాతను రాసేది
బ్రతుకు భవితను తేల్చేది గురువే!



-బొల్లం బాలకృష్ణ
సెల్:9989735216

## ఏవైనా మనకే....

ఏమైందో ఏమో!
ఈ మధ్య ఏపుగా పెరగడానికి
మొక్కలెందుకో మొరాయిస్తున్నాయి
ఆకాశంవైపు చూడాల్సినమొక్కలు
నేలచూపులు చూస్తున్నాయి
నలుగురికి నీడనివ్వాల్సిన మొక్కలు
ఆకులను దులపరించుకుంటున్నాయి
వసంతాన్ని ఆస్వాదించాల్సిన మొక్కలు
శిశిరాన్నాహ్వానిస్తున్నాయి.

నువ్వెన్నైనా చెప్పు
మొక్కలెప్పుడు మొక్కలే !
వాటిలోని
సౌకుమార్యాన్ని వెలికితీయాలేకానీ
ఎలా వుండాలో నేర్పుతాయి
వాటిలో దైవత్వాన్ని దర్శించాలే గానీ
ఎందుకు చేరదీయాలో చెబుతాయి
వాటిని వాటికే కొత్తగా పరిచయం
చేయాలే కానీ

సమాజానికెంత
ప్రాణప్రదమో నిరూపిస్తాయి.

అవి లేత మొక్కలు
అవి పెరుగుతున్న మొక్కలు
అవి పరిమళాలను వెదజల్లే మొక్కలు
ఎప్పుడైనా అవి నీడనిచ్చే మొక్కలు.

మనసమక్షంలో
పెరుగుతున్న మొక్కలవి
కట్టుకట్టినా మనమే
కంచెలేసినా మనమే
ఎండిపోకుండా చూసేబాధ్యత మనదే
ఏపుగాపెంచే బాధ్యతా మనదే
పదిమందికి నీడనిచ్చాక
వచ్చే ప్రశంసలూ మనకే..



- ఎన్.నరేశ్ చారి
9701334516

## మా ఇల్లు

ఇల్లు అంటే నాకు ప్రాణం
ఇంటి పెద్దదర్వాజా ఇంకా ఇష్టం
దూలాలు వాసాలు పచ్చగా
రంగులేసుకుని కళకళలాడేది.

తెల్లని వెన్నెల పులుముకున్న గోడలు
బెంగుళూరు పెంకతో ముద్దుగా
నాలుగు దిక్కుల తలుపులు
చక్కగా విశాలంగా ఉండేది మా ఇల్లు

ఇంటి వెనకాల పశువుల కొట్టం
చేదబావి పై చప్పుడు చేసే బొక్కెన
సాయబానలో ఊర పిచ్చుకల సందడి
అరుగు మీద ధాన్యలక్ష్మి గుమ్ములు

మా ఉచ్వాస నిచ్వాసలను మోస్తు
తన కడుపులో ప్రేమగా మమ్ముల
దాచుకుని కనురెప్పగా కాస్తు
ఇల్లంతా నవ్వులపూలు పూయించేది

దానిమీద ఏ దుష్టుడి కన్నుబడ్డదో
వాడి ఇల్లు మన్ను కాదా
వాడి కండ్లు కాకులు ఎత్తుక పోవా
వెంటపడ్డోడిని దేవుడు ఎత్తకపోడా

ఇప్పుడు అక్కడ మా ఇల్లు లేదు
ఎందుకెంటపడి గూల్చిండ్లో తెల్వదు
కుట్రలతో విషబీజాలు నాటుకున్న
మనుషులెప్పుడంతమౌదురో గదా

బలవంతులెప్పుడు బలహీనుడిమీద
ఆధిపత్యం చేస్తునే వుంటారు
ఈ భూమి మీద డబ్బుంటే చాలు
కుక్కకైనా విలువిస్తారు మనుషులు

ఇప్పుడు ఆనవాళ్లు లేని జ్ఞాపకాలై
మిగిలిపోయిన ఆ నేల పొరలలో
నేను దుఃఖ గీతమై నా ఇంటిని
నిత్యం ఆశగా వెతుకుతూనే ఉన్నాను!!



- వజ్జీరు ప్రదీప్
9989562991

## జీవన శాంతి చిత్రం

ప్రతి మనిషి
శాంతి కాముఖ జీవితాన్ని కోరుకుంటూ
సకలజనుల ప్రేమను అందించే మార్గంలో సాగిపోవడమే
దివ్య జీవన మాయ ప్రపంచాన్ని ఆశించడం కొద్దిమందికి
మరి కొద్దిమందికి ప్రపంచమంతా కొత్త వెలుగులతో..
వినూత్న దిశగా మనోహర ప్రపంచాన్ని ప్రకృతి ఆరాధన
ఆశించడమే యువ చైతన్యం ఇదే జన స్వరం
జనం కాంతి ప్రపంచాన్ని ఆశించడం
ఆ ప్రపంచం ప్రేమ విశ్రాంతి పరుల అభ్యున్నతిని ఆశించడమే...
మానవుని గొప్ప కానుక...
ఒక దివ్యమూర్తి జననం.....
ప్రతి కొత్త వెలుగుకు నాందిగీతం...
ప్రతి ప్రపంచం ఆశించే
మనోహర భావాలకు వెలుగు కేతన ము...



-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

# రాజు మార్గం చూపే రజిత శతకం..!

పుస్తక సమీక్ష






నేటి సమాజంలో పిల్లలకు, యువతరానికి ఉపయుక్తంగా ఉండే విధంగా.. పిల్లల్లో ఆలోచనాశక్తిని పెంచేందుకు.. వారిని సదాచార సంపన్నులుగా చేసేందుకు కవయిత్రి చింతలతాడెం రజిత "సుపథ శతకం" పేరుతో ఓ పద్య కావ్యాన్ని వెలువరించారు. రాజమార్గం చూపేందుకు రజితగారు "రాజమార్గ మౌను రజిత పథము" అనే మకు టంతో ఇందలి రచనను కొనసాగించారు. ఆటవెలదిలో రాయబడిన పద్యాలు సమాజంలో నైతిక విలువలు పెంపొందించేందుకు దోహదపడేలా కొలువుదీ రాయి.

తొలుత విఘ్నముల బాపి విజయమొసగి నిల్చి పాప కర్మము లను బాపుమయ్యా అంటూ గణపతి ప్రార్థనతో పాటు.. సరస్వతమ్మను కొలిచి ఇందలి పద్యాలకు శ్రీకారం చుట్టారు.

**'ఒంటరైన నీవు కంట నీరు విడక**
**పోరు చేయు నిల్చి ధీరుడగును**
**సింహమట్లు నిలుము స్థిర చిత్తుడవగుచు**
**రాజమార్గమౌను రజిత పథము"**
అంటూ

కంటనీరు పెట్టక.. పోరు చేసి ధీరులుగా నిలువాలని పిలుపునిచ్చారు.

చిన్నవారికి, కన్నవారికి, తోటివారికి ఎప్పుడు చేయూతనిస్తూ, కరుణ చూపుతూ తోడుగా నిలువాలంటూ.. ఇలా రాశారు.

**"చిన్నవారికివ్వు చేయూతనెపుదును**
**కన్నవారిపట్ల కరుణ బాపు**
**తోటి వారికెపుడు తోడుగా నిలువుము**
**రాజమార్గమౌను రజిత పథము"**
అని ఓ పద్యం ద్వారా హితవు పలికారు.

మాతృభాషతో మమతలు పంచాలని కాంక్షిస్తూ మరో పద్యాన్ని రూపుదిద్దారు–

**మాట నేర్చి మనిషి మహనీయు దయ్యెరా**
**భావమంత దెల్ప భాష నేర్చె**
**మనసు మమతలవియు మాతృభా షయె దెల్ప**
**రాజ మార్గమౌను రజిత పథము**
అంటూ పగటి కలల కోసం పాకులాట తగదంటూ ఇంకొక పద్యానికి ఇందులో చోటు కల్పించారు.

**నవ్వబోకు పరులు నొవ్వగా నెప్పుడున్**
**సాదరముగ నిలిచి యాదరించు**
**యొరుల జూసి నవ్వయోటమి నీదౌను**
**రాజమార్గమౌను రజిత పథము**
అంటూ పరుల చూసి నవ్వి వారిని నొప్పించవలదని సూచించారు.

అన్నదాతకు మించి దాత ఎరువున్నారంటూ ప్రశ్నిస్తూ రాసిన పద్యంలో..

**అన్నదాత దీర్చు నాకలి బాధను**
**ఫలితమిచ్చు మనకు పంటవేసి**
**దాతకన్న గొప్ప ధాత్రియందెవ దయా?**
**రాజమార్గమౌను రజిత పథము**
అంటూ అన్నదాత ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

**కుటిల బుద్ధితోడ కోరివచ్చెడివారి**
**చేరదీయవలదు చెంతకెపుడు**
**నమ్మి నడవజూడ నట్టేట ముంచేరు**
**రాజమార్గమౌను రజితపథము**
అంటూ కుటిల బుద్ధివారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మహిలో మాటకు ఉన్న విలువ గొప్పదన్న విషయాన్ని తెలియజేస్తూ.. మరో పద్యం రాశారు.

**మాట యిచ్చినీవు మరువబోకు మెపుడు**
**పలుకు మార్చు మనిషి భవిత తీరు**
**మాటకున్న విలువ మహిలోన మిన్నరా**
**రాజమార్గ మౌను రజిత పథము"** అంటూ.. యిచ్చిన మాట తప్పవలదని పేర్కొన్నారు.

**ఇరుగు పొరుగు వారి నీసడించగరాదు**
**తోడు కూడియుండి నీడనివ్వ మంటూ**
మరో పద్యం ద్వారా తెలియజెప్పారు.

ఇంకా ఈ కావ్యంలోని వివిధ పద్యాల ద్వారా.. హానిచేయబోకు మన్యులకెపుడును.. అనీ.. ధనము కూడబెట్టి మనమున పొంగకు అనీ.. మెరుగు దిద్దినంత వేనికి సరిపోదనీ.. మనసు కద్దవోయి మమత రహిని..

ముక్కుసూటి తనము మురిపించదెవరినీ అనీ.. విద్యయొకటె నీదు విధిని మార్చునంటూ.. ఇలా వివిధ పద్యాల ఎన్నో మంచి మాటలను చెప్పడంలో కవయిత్రి రజితగారు సఫలీకృతులై నారు.

కవయిత్రి మొదటి ప్రయత్నం లోనే ఛందోబద్ధ పద్యాలను రాసి అందరినీ మెప్పించడం ఆనందదాయకం.. సమాజంలో నైతిక విలువలు పెంచ డానికి ఆమె చేసిన కృషి స్వాగతించదగింది.

మున్ముందు పద్యకావ్యాలతో పాటు.. పూర్తిస్థాయి వచన కవిత్వంతో కవయిత్రి రజితగారు మనముందుకు రావాలని కోరుకుందాం. ఆ దిశలో అడుగులు వేస్తారని ఆశిద్దాం.

**ప్రతులకు:** చింతలతాడెం రజిత
ఇం.నెం. 2–45
గ్రా: అచంపల్లి, మం: గంగాధర
జిల్లా: కరీంనగర్
సెల్: 8187831667



- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

పుస్తక సమీక్షలు

# ఆదిత్య హృదయ స్తోత్ర అంతరార్థం- మండాది వారి కూర్పు




అనుష్ఠానం, సత్సాంగత్యం, దైవచింతన చిన్నప్పటి నుండి జీవితాంతం ఆచరించిన మండాది సత్యనారాయణ మూర్తిగారి కూర్పు, 'ఆదిత్య హృదయ స్తోత్ర సంస్కృత నామావళి', మంత్ర అర్థయుక్తంగా, ఆధ్యాత్మిక జిజ్ఞాసి, రాధాకృష్ణ ఉప్పల సంపాదకునిగా వెలువరించారు. శ్రీ రామాయణాంతర్గతమైన ఈ స్తోత్ర ప్రాశస్త్యం దృష్ట్యా, సర్వ దేవతారాధన అయిన సనాతన ఋషి సంప్రదాయ పవిత్రత కలిగి ఆదిత్య హృదయంగా విరాజిల్లుతోంది. శ్రీ మద్రామాయణంలో యుద్ధకాండలో ఆగస్త్య మహర్షి, శ్రీ రామచంద్రునికి ఉపదేశించిన ఆదిత్య పరమాత్మ స్తోత్ర స్తుతి 125 నామాలను మంత్ర,అర్థ సమన్వితంగా ఈ చిన్న పుస్తకం ఆవిష్కరిస్తోంది. స్తోత్ర పరిచయం, సంపాదకీయం, స్తోత్రం, నామావళి మంత్ర, అర్థాలతో, డా॥ చిఱ్ఱావూరి శివరామకృష్ణ పరిష్కరించిన ఈ కూర్పు, ఆస్తిక లోకానికి ఉప్పల రాధాకృష్ణ ఆధ్యాత్మిక కానుకగా ప్రచురింపచేసారు. జగత్కల్యాణ కారకుడైన సూర్య భగవానునిపైన ఆధారపడి సకల ప్రాణికోటి జీవిస్తోంది. ఇహపరాలకు ప్రత్యక్ష ఆరాధ్యదైవం అయిన ఆదిత్య హృదయ స్తోత్ర అంతరార్థం ఈ పుటలలో అద్భుతంగా అందచేసారు.

ప్రతులకు: రాధాకృష్ణ ఉప్పల
శ్రీహరివాసం 119/1
మోతీనగర్,
హైదరాబాద్–500 114
సెల్: 9885422354



-జయసూర్య
సెల్:9014948336
9394775088

## విజ్ఞత (కథ)

స్కూల్‌కి వెళ్ళిన అన్విత అరగంటలోపే అమ్మమ్మ! అమ్మమ్మ! అంటూ రొప్పుతూ వస్తుంది.

వంటింట్లో నుండి పరుగున వచ్చిన సరస్వతమ్మ ఎదురెళ్లి అక్కున చేర్చుకుంది కంటినీరు తుడిచింది లాలనగా తల నిమురుతూ సంబాళించింది చేరుకున్న అన్విత అమ్మమ్మ నీకు ఇది తెలుసా నా స్నేహితురాలు అశ్విని చనిపోయింది .ఎవరో తనని చంపేశారు అంట అంటూ మళ్ళీ వెక్కడం మొదలుపెట్టింది.

ఉలిక్కి పడిన సరస్వతమ్మ అన్వితను మరింత దగ్గరకు పొదువుకుంది. డ్యూటీకి వెళ్ళిన కూతురు తిరిగి వస్తుండడం చూసిన సరస్వతమ్మ ఏమైంది సరోజిని మన పక్క వీధిలోని అశ్విని గురించి ఏదో చెబుతోంది పాప నిజమేనా అంది.

అవునమ్మా అశ్విని పక్కింట్లో ఉన్న చంద్ర అంకులే ఇలా చేశాడని చెప్తున్నారు ఇప్పుడే పోలీసులు అతనిని అరెస్టు చేసి తీసుకెళ్లారు.

అవునా అంటూ నోరెళ్ల పెట్టింది సరస్వతమ్మ. ఎంత అమాయకంగా ఉండేవాడు ఎన్ని నీతి మాటలు చెప్పేవాడు తనా ఇలా చేసింది అన్నది.

అయినా ఈ కాలం ఆడపిల్ల ఎంత తెలివిగా ఉండాలి ఏది మంచో ఏది చెడో తల్లులు చెప్పాలి అయినా ఆ తల్లులకు చెప్పే సమయం ఎక్కడుంది ఉద్యోగం సంపాదన అంటూ పరుగులు పెడుతూ బిడ్డల్ని వారి బాగోగుల్ని పట్టించుకోకుండా మేమే అంతా చేస్తున్నాం అంటుంటారు .చిన్నప్పుడు మా అమ్మ చెప్పే చిలకమ్మ పెంపకం కథలోలా ఉంటది అన్నది బాధగా...

అదేంటమ్మా అలా అంటావు అశ్విని అంటే రాగిణికి పంచప్రాణాలు మాయల పకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు రాగిణి ఆశా శ్వాస తనే ఎన్ని త్యాగాలు చేసింది. ఎంత ఉరుకులు పరుగులతో అందరినీ చూస్తూ ఉద్యోగం చేస్తుంది ఎప్పుడైనా సరదాగా సినిమాకు వెళ్దాం అన్నా ఇంట్లో పిల్ల ఒక్కతే ఉంటదని ఇంటికి పరుగున వెళ్ళేది . ఒక్కగానొక్క బిడ్డ అని కళ్ళలో పెట్టుకుని చూసుకుంది.ఎప్పుడు ఇంట్లోనే ఉంచేది బయట అడుగు పెట్టనిచ్చేదే కాదు మరి మంచి చెడు నేర్పకుండా ఉంటదా.. ఆ నంగనాచి వెధవ నీతి మాటలు చెప్తూ పిల్లను చేరదీస్తుంటే సంతోషించింది. అశ్విని తాతయ్య అనే పిలిస్తే తన మనవరాలు అనిపిస్తుంది అంటూ ప్రేమ చూపితే తన తండ్రిలా భావించి తనకూ సపర్యలు చేసింది గుంటనక్కలా ఇంత పని చేస్తాడని ఎలా ఊహించగలం.

గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి కూడా పిల్లలకు పాఠాల్లో చెప్పడం సంతోషంగా ఉందని దానివల్ల పిల్లలకు మంచి చెడు తెలుస్తాయని నిన్న సాయంత్రం వస్తూ మాట్లాడుకున్నాం. ఇంతలో ఇదంతా జరిగింది. వీరి మాటలు వింటున్న అన్విత అమ్మమ్మ చిలకమ్మ పెంపకం అన్నావు అంటే ఏమిటి అమ్మమ్మ అంది అదా ఒక కోనలో చిలకమ్మకు ముగ్గురు పిల్లలు కలిగారు పిల్లలపై అవాజ్యమైన ప్రేమ ఉన్న చిలుక వారికి ఎటువంటి ఆపద రాకూడదని బయటకు వెళ్ళనివ్వకుండా తనే ఆహారం తెచ్చి పెట్టేది పైగా పిల్లలకు

వేటగాడు వస్తున్నాడు వస్తున్నాడు గింజలు ఎరగా వేస్తున్నాడు
మెడలు విరి చేస్తాడు విరి చేస్తాడు

అనే మూడు వాక్యాలు నేర్పించింది ఇంకేం భయం లేదంటూ తన బిడ్డలు జాగ్రత్తగా ఉంటారని స్వేచ్ఛగా ఆహారాన్వేషణకు వెళ్ళింది. వేటగాడు రానే వచ్చాడు వేటగాడు వచ్చాడు వచ్చాడు అని అరిచాయి ప్రమాదం అని గ్రహించిన వేటగాడు చెట్టు చాటుకు వెళ్ళాడు. కాసేపటి తర్వాత ధైర్యం చేసి గింజలు విసిరాడు వేటగాడు గింజలు వేస్తున్నాడు వేస్తున్నాడు అంటూనే గింజలకై కిందకు వాలాయి చిలుకలు వేటగాడు మెడలు విరిచేస్తాడు అంటూనే అతని చేత మెడలు విరిచబడి మరణించాయి అని చెప్పుకొచ్చింది అయ్యో పాపం అంది అన్విత.

నా బిడ్డను అలా ఏం పెంచలేదు అంది సరోజ రోషంగా

అయ్యో !నా బంగారు తల్లి నిన్ను అనలేదే.. ఏదేమైనా ఈ కాలం తల్లులు అతి ప్రేమతో అద్దాలమేడలో ఉంచి పిల్లలను సమాజానికి దూరంగా పెంచుతున్నారు .సమాజంలోని చెడులను చెబుతున్నారు. అన్నీ విషయాలు క్షుణ్ణంగా చెప్తున్నారు. కానీ పిల్లలకు విషయ జ్ఞానం ఉపయోగించే విజ్ఞత నేర్చుకొనివ్వడం లేదు.ఒక ప్రేమ పాశం ఉచ్చులో బలి చేస్తున్నారు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంటే చెప్పడం కాదు సరోజ అలాంటిది ఎదురైనప్పుడు ఎదుర్కొనే స్థైర్యాన్ని నేర్పును నేర్పాలి అంటున్నాను ఎవరిని గుడ్డిగా నమ్మి అమ్మాయిలు బలి అవ్వకూడదనీ నా ఆలోచన అంది .అమ్మను అబ్బురంగా చూస్తున్న సరోజ చప్పట్ల శబ్దంతో చుట్టూ చూసింది అన్విత. నాన్న రావడంతో నాన్న అంటూ పరుగెట్టి నాన్నను చుట్టుకుంది. అందుకే పెద్దవారి మాట పెరుగన్నం వంటిదని అంటారు అన్నాడు అన్వేష్...



-లతా శ్రీ
9666779103

# ఏది నీ శక్తి

ఎందుకు మౌనం ఎందుకు మౌనం
కనులను మూసి కలమును ఆపీ
సాధించే దేమిటి కలికాలం?

మనుషుల విలువ మంటలో కలిసి
మత మౌఢ్యానికి అడ్డులు లేక
విర్రవీగుతూ దౌర్జన్యాలు
కళ్ళ ముందటే జరుగుతు ఉంటే
ఎందుకు మౌనం ఎందుకు మౌనం?

చెవులు పెట్టుకొని చేవ చంపుకొని
బాధ్యత మరిచి భారం తుంచి
రాక్షస కృత్యపు సమాజ చేష్టకు
తలలు వంచుకొని ఆత్మచంపుకొని
బతుకు ఎందుకు చాన్నాళ్లు?

కళ్ళముందటే మారణ హోమం
రాక్షస రాజ్యపు తీరని దాహం
నడిబజారులో నారీ నగ్నం
కుల ద్రోహానికి ప్రేమిక హతం
నిన్నటి గాయం మానదె లేదు
కొత్త గాయమై ఉండుగా దేశం

అరాచకానికి అదుపే లేదు
రకరకాలుగా నాశనవాదం
ఆలోచన వాదికి లౌక్యం శూన్యం
అవకాశవాదికి అందిన పీఠం
చేవ చచ్చిన జనస్వామ్యానికి
నోటు ఓటుతో గుండెకు గాయం

సిద్ధాంతాలా సిగ్గు సిగ్గులే
మాటలన్నీ బొగ్గు రాతలే
స్వేచ్ఛా స్వాతంత్రం వట్టిగ
పలికే నినాదాలు
కోరితె గుచ్చే వాడి ముళ్ళు
గుండెల దూరే తూటాలవుతాయి.

వీపులు పగిలే లాఠీ లౌతాయి
గొంతులు నిలిపే హస్తాలవుతాయి
జైలు గదిలోని చీకట్లవుతాయి
నిర్బంధాల ఆర్డర్లవుతాయి
అక్రమ కేసుల రాతలు అవుతాయి.

స్వేచ్ఛ స్వాతంత్రాలు అధికారాలు
గర్వ బలానికి ఆట వస్తువులు
సామాన్యుని కందని ఆశా ఫలాలు
కళ్ళముందటే అరాచకాలు
కొంపలు కూల్చే దురాగతాలు
పిచ్చి ఎక్కినా మత మౌఢ్యాలు
సమైక్యతకు ఆటంకాలు
ప్రశ్నలు నరికే ఆయుధాలు
దోపిడీలకు నవ మార్గాలు.

రాక్షస రాజ్యం ద్రోహుల బోజ్యం
సగటు మనిషికి బతుకే భారం
మతం పేరుతో కులం పేరుతో
భారతావని సాగు దారిలో
రక్తపు అలుకులు మోసపు పలుకులు
నటనల బతుకులు రాక్షస మనసులు.

అన్యాయం అని చెబితే చాలు
అణచి వేసే చంపే కుట్రలు
ఏమిటిది ప్రశ్నిస్తే చాలు
నిర్బంధించే అధికారాలు.

సగటు మనిషికి నీడనే లేదు
లౌకికానికి అర్థం లేదు
ప్రజాస్వామ్యం ఇది ఎవరికి తోడు
నాయక మదాందులు చెబితే ఆడు.

ఎవరి జీవితం ఎవరికోసమూ
అడ్డు నిలిస్తే అదే ఆఖరు
న్యాయదేవతా కళ్ళ ముందరే
న్యాయం రోజు అమ్ముడు పోతే
గర్వభలంతో అన్నితానై
ఇష్ట రాజ్యం సాగుతు ఉంటే
ఎవరికి ఎవరు ఎవరికి తోడు?

మనిషి బాధలు మనుగడ ఆశలు
చేవచంపుకొని నిలిచే తీరు
ఎన్నాళ్ళని ప్రశ్నించదు మనసు?

మనసుకు ప్రశ్న ప్రశ్నకు మనసు
కొత్తది కాదు తర్కం కోసం ప్రాణం కాదు
ప్రాణం తర్కపు మూలం కాదు.

నీ బతుకేమిటొ నీకే తెలుసు
పక్కవాడిదే పొరపాటు
పోరాటం ఇది బతుకుకు మూలం
మనిషిని మనిషిగ నిలిపే ధైర్యం
శక్తి చాలదా సమీకరించు
యుక్తి చాలదా చరిత్రనడుగు
ఉదయించేటి సూర్యుడు తోడు
వీరుడి గీతం ఆపకపాడు.

ఉద్యమ చేతన వెలుగుల కిరణం
ఏ వైపో ఆ వైపుగ సాగు
రేపటి కాలం ఎంచెను నిన్ను
సమరాంగనమున పిలిచెను నిన్ను
అంధకారమును చీల్చే ఖడ్గం
వెలుగుల కిరణం నీవేలే.

నీ ప్రతి ఆశ న్యాయపు శ్వాస
కలముకు చేవా లక్ష్యపు నావ
శక్తికి రూపం వెలిగే దీపం
నీవే నీవే నీవేలే.

ఎన్నెన్నో పోరాట చరితలు
ఎన్నెన్నో మన వీరుల కథలు
ఆకాశమైన ఎత్తిన పిడికిలి
మనసు మనసున గెలుపు అలికిడి
మార్పు పథమ్మున నడిచిన నడకా
చిమ్మ చీకటిలో వీరుని కేక
వీరుడి కోసం వేకువ రాక.

బలవంతుడివా బలహీనుడివా
మాటల మాటున బతుకీడ్చెదవా
వివేకుడివా విధి లేనోడివా
ఆశలు చచ్చిన పీనుగువా
ఏది నీ శక్తి ఏది నీయుక్తి?

మనసులో ఉన్న మర్మమేమిటి
కాలం నేర్పిన నీతి ఏమిటి ?
ఎదురుగ నిలిచే ధైర్యం లేదా
అడుగులు వేసే శక్తే లేదా
నిజాయితి నీలో నిండుగ ఉంటే
నింగి కూడా వంగి ఉండదా?
ఏది నీ శక్తి ఏది నీ యుక్తి
ఏది నీ శక్తి ఏది నీ యుక్తి ?



– సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

# గుప్పెడు అక్షరాలు

తలకిందుల తపస్సు
ఒంటి కాలిపై నిలబడడం
చెరువులో మునిగి చేతులెత్తడం
వగైరా కష్టాలేం లేవు
పుట్టినరోజు నుంచి
అందరూ పంచిన
అక్షర విత్తనాలను
గుండెల్లో దాచుకుంటున్నా
నెత్తిల పెట్టుకొని ఊరేగుతున్నా.

గుప్పెడు అక్షరాల విత్తనాలు
సొంతమయ్యాయి
దాచుకుంటే
మరుపు పురుగు పడతాయి
పుచ్చులైపోతాయి.

అదును చూసి
గుప్పెడు అక్షరాలు
పిల్ల పక్షులకు చల్లా
ఆశ్చర్యం అది బడయింది.

అక్షర విత్తనాలు
అవనిపై ఎక్కడ చల్లినా
మొలకెత్తి
ఆకాశ కిరణాలకు
తడుస్తున్నాయి
దండిగా విస్తరిస్తున్నాయి.
ఎందరో దొంగిలించారు
గుప్పెడు అక్షరాలను
చేతులు ఖాళీగా లేవు
మళ్లీ అక్షర సంపదతో నిండుగా.
గుప్పెడు అక్షరాలంటే
అంతులేని నిధి
తరగని సంపద
అల్లావుద్దీన్ అద్భుతదీపం
అక్షయపాత్ర
కామధేనువు.
అక్షర సేద్యం
మరిచిన వాడు
ఎడారి కంటే హీనం.
అక్షర దాహం తీరనిది
ఎన్ని భాషల
వేలు పట్టుకొని నడిచినా
మిగిలేది గుప్పెడు అక్షరాలే.
అక్షరం
ప్రజాక్షేమం కోరనపుడు
పీతిరి తొక్కి
కాళ్లు కడుక్కోనట్లే



–కొమురవెల్లి అంజయ్య
9848005676

# ఎదురు చూపు

జీవిత ప్రయాణమే ఓ మజిలీ
తల్లి కడుపున
ఓ తొమ్మిది నెలల మజిలీ
చిరునవ్వులతో....
అందరి ప్రేమలతో సాగే బాల్యం .....
మలి మజిలీ
పుస్తకాలతో కుస్తీ పడుతూ.....
పాటలతో
పాఠాలు నేర్చుకుంటూ సాగే
విద్యార్థి దశ......మరో మజిలీ
ఉద్యోగం కోసం....
పరుగులు పెట్టి....
అలసిపోక, సొలసి పోక
లంచాలు, రికమెండేషన్ల ప్రవాహానికి
ఎదురీదుతూ....
విజయం సాధించే దాకా
చేసే పోరాటం ఒక మజిలీ
నేను... నా... అనే అహంతో.....
ఎవరినీ లెక్క చేయని
ఉడుకు రక్తపు వయసు .......
ఒక మజిలీ
సంసార సాగరంలో మునిగి తేలుతూ...
పిల్లలు, పంపకాలు, చదువులనే
అటు పోట్లను అధిగమిస్తూ....
సాగించే సంసార జీవితం.......
మరో మజిలీ
అన్నీ అయినాక....
వెండి తీగలు నెత్తి మీదకొచ్చి.....
మసక తెరలు కళ్ళకడ్డంపడి....
అడుగులు భారమై...
తడబడిన నాడు...
పిండిన వస్త్రంలా
శరీరం మారిన నాడు....
నేను... నా... అనే అహం తగ్గి....
మూడో కాలు చేరిన నాడు....
అప్పుడు.... అప్పుడు...
గతమంతా బుర్రను
కందిరీగలా తొలుస్తుంటే......
అప్పుడర్థమవుతుంది
జీవిత ప్రయాణంలో
చివరి మజిలీకి చేరుతున్నానని...
అప్పుడు మొదలవుతుంది
ఒక చల్లని మాట కోసం...
ఒక మంచి ఆసరా కోసం.....
ఎదురు చూపు

–జి. మధు మురళి
భీమారం
హన్మకొండ

# అవహేళన (కథ)

మా తరగతిలో అఖిల్ అనే అబ్బాయి ఉండేవాడు. ఆ అబ్బాయంటే చాలా ఇష్టం నాకు. చాలా మంచివాడు. నిదానంగా ఉంటాడు. మా క్లాసులోని మిగతా స్నేహితుల్లా ఈర్ష్య పడకుండా ఉంటాడు. నాకు ఫస్ట్ర్యాంకు వస్తే ఆనందంగా చప్పట్లు కొడతాడు. తాను బాగా చదవలేడు. ఎప్పుడు 70 శాతం దాటవు మార్కులు. అయిన నాకిష్టమే. టీచర్ల దగ్గర పక్క పిల్లల మీద పితురీలు చెప్పాడు. తన లోకంలో తనుంటాడు.

పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పెనర్లు బయటకు తీసి వాడుకున్న వెంటనే బ్యాగులో పెట్టుకోడు. పక్క పిల్లలు పుస్తకాలు అడిగితే వెంటనే ఇచ్చేస్తాడు. మరలా తెచ్చిచ్చారా లేదా అని గుర్తు పెట్టుకొని అడగడు. ఇంటికి వెళ్లేటపుడు అన్నీ పుస్తకాలు, పెన్సిళ్లు బ్యాగులో పెట్టుకోవడం మర్చిపోతుంటాడు.

అందుకని టీచర్లు అందరూ వీడిని అమాయకూడని అంటుంటారు. దీన్ని అలుసుగా తీసుకొని మా ఫ్రెండ్స్ వాడి పుస్తకాలు పెన్సిళ్లు కొట్టేస్తూ ఉంటారు. అయినా వాడికది అర్థం కాదు. నేనున్తే మాత్రం వాడి పుస్తకాలు, పెన్సిళ్లు బ్యాగులో సర్దేసి పెడతాను. ఇంకా ఎవరూ దొంగిలించకుండా కూడా చూస్తుంటాను. ఎందుకంటే మంచి స్నేహితులకు సహాయం చేయాలని మా అమ్మ ఎప్పుడు చెప్తుంటుంది.

నాకు జ్వరం వచ్చి నిన్న స్కూలుకు రాలేదు. ఈరోజు వచ్చాను. ఈరోజు లంచ్ అవర్లో అఖిల్ వాళ్ల అమ్మ వచ్చింది. నిన్న అఖిల్ పాఠ్య పుస్తకాలు పోయాయట అడగటానికి వచ్చింది.

'మా అఖిల్ పుస్తకాలు స్కూల్లోనే ఉండిపోయాయండి కొంచెం చూసి ఇవ్వండి' అని ఆమె మాస్టారును అడిగింది. మా మాస్టారుకు బాగా చదవని వాళ్ళంటే ఇష్టం ఉండదు. ఆయనకసలే ర్యాంకుల పిచ్చి, ర్యాంకులు వచ్చిన వాళ్లనే తెలివిగల వాళ్లంటూ పొగుడుతాడు.

'ఇంకా ఎక్కడుంటాయమ్మా! బ్యాగులో పెట్టుకోమని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోడు. అసలే మందమతి. మేం కాబట్టి స్కూల్లో చేర్చుకున్నాం గాని వేరే స్కూల్లో అయితే చేర్చుకునే వాళ్లే కాదు" అని కాస్త అసహనంగా అన్నాడు.

ఆ మాటలకు అఖిల్ వాళ్ళమ్మకు కళ్ల వెంట నీళ్ళు వచ్చాయి. వెంటనే తెరుకుని " మా అబ్బాయి తెలివి తక్కువ వాడయి పుస్తకాలు పారేసుకుంటే మాకు నష్టం కానీ మీకేం కష్టం. మా అబ్బాయి పుస్తకాలు ఇప్పించండి సార్" అన్నది.

'మీరు భలే వారమ్మా! ఎవరైనా పుస్తకాలు మరిచిపోతే ఇంకా అక్కడే ఉంటాయా? ఎవరో తీసుకెళ్లి ఉంటారు. వాళ్లేమైన మీ అబ్బాయి లాగా మందమతులా?' కాస్త అవహేళనగా అన్నాడు మాస్టారు.

అప్పుడు అఖిల్ వాళ్లమ్మ ఇలా 'చూడండి మాస్టారూ! విద్యార్థులకు మంచి చెడులు నేర్పించాల్సిన మీరే ఇలా మాట్లాడుతున్నారు. మా అబ్బాయిని మందమతని, తెలివి తక్కువవాడని, తన వస్తువులు తాను తీసుకెళ్లటం మరిచిపోతాడని ఎగతాళి చేస్తున్నారు. ఇలాంటి తెలివి తక్కువ వాళ్లు తమ వస్తువులను పోగొట్టుకుంటారు తప్ప, మీరు పొగుడుతున్న తెలివికల వాళ్లలాగా ఇతరుల వస్తువులను తీసుకెళ్లరు. మా అబ్బాయిలాంటి వారి వల్ల సమాజానికి ఏమి నష్టం కలగదు. కానీ పక్క పిల్లల వస్తువులను తీసుకెళ్లాలనే ఆలోచన ఉన్న పిల్లల వల్ల సమాజానికి చాలా నష్టం. రేపు వాళ్ళు దొంగలుగానో, లంచగొండులుగానో, అవినీతిపరులుగానో తయారవుతారు. మా అబ్బాయిని ఎగతాళి చేయడం మాని మిగతా పిల్లల్ని మంచి దారిలో పెట్టె ప్రయత్నం చేయండి. మాస్టారంటే పిల్లలకు మార్గ నిర్దేశకుడిగా ఉండాలి గాని పిల్లల్లోని అవకారాలను ఎత్తి పొడవడం కాదు. మీలాంటి మాస్టార్లున్న ఈ స్కూలులో మా అబ్బాయిని నేను చదివించను' అంటూ ఆమె అఖిల్ ను తీసుకొని వెళ్లిపోయింది.



–డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

# స్త్రీ జీవితం సుడిగుండాలమయం

## (శీలా సుభద్రాదేవి మూడు కథలు)

ఈ లోకమిట్లా ఎందుకున్నది అన్న ఆలోచన వచ్చినప్పుడల్లా విచారంతో మనసు నిండిపోతుంది. అప్పుడు విచారణ మొదలవుతుంది. అందులోనూ మానవజాతి మనుగడకు ప్రాణం పోసే స్త్రీల జీవితాలను అనుక్షణం అన్ని దిక్కుల నుండీ కమ్ముకునే నిషిద్ధ మేఘాలు విషాదాల్నీ భయాల్నీ కలిగిస్తుంటాయి.

మబ్బులు కమ్ముకున్న వాతావరణంలో మానవాళి ఎక్కువసేపు ఉండలేక మబ్బులు విడిపోవాలని ఆరాటపడుతుంటుంది. నిత్యం ఈ లోకం స్త్రీ జీవితంలో మబ్బుల్లా కమ్ముకొని చీకటి ప్రపంచంలో బ్రతకమని ఆలోచనలూ, ఆచారాలూ, సంప్రదాయాలూ, తంతుల ద్వారా సాంఘిక నియమాలను శాసనాలుగా అమలుపరుస్తూ స్త్రీలను అధోగతిలోనే అణిచిపెడుతుంది.

వైవాహిక జీవితం స్త్రీల పాలిట ఒక రకమైన బంధీఖానా అయితే ఒంటరి స్త్రీల జీవితాలకు ఆ చెరలు అదనంగా ఎన్నో ఉంటాయి.

ప్రపంచంలో మిలీనియపు మైలురాళ్లు దాటుతూ అభివృద్ధుల రికార్డులు నెలకొల్పుతున్నారు. కొత్త సంవత్సరాల వేడుకలు అతిభీకర రూపాల్లో చేసుకుంటూ ముఖ్యమైన మానవ వనరులైన మహిళల స్థితిగతులలో మార్పుల గురించి పట్టించుకోవు ఏ రాజ్యాలూ – ప్రభుత్వాలూ.. సంక్షేమం గురించి సవాలక్ష ఉపన్యాసాలు, ఉవాచలు గుప్పించే నేర్పరులు.. బలహీనుల బతుకులపై ఆధిపత్యం వహించే తీర్పరులుగా సమాజంలో అసమానతలకు ఆజ్యం పోస్తుంటారు!

ఈ వ్యవస్థలో ఒంటరి స్త్రీల వెతలు అంతులేనివి. హృదయం లేనివారికి అవి అంతుపట్టనివి అసలే పట్టింపుకురానివి. అందునా ఏ వయసులో భర్త చనిపోయినా ఒక స్త్రీ మరింత హీనత్వాన్నీ, దీనత్వాన్నీ అనుభవించాల్సి వస్తుంది. వారి చుట్టూ 'గోడలు' మరింత పటిష్టంగా కడ్తుంది లోకం. లోకులు పలుకాకుల్లా మారిపోతారు. అధికారికంగా హక్కులను హరిస్తూ క్రూర శాసనాలు జారీ చేసేందుకు అందరూ కర్రసాము చేస్తూ బెదిరిస్తుంటారు.

××

శీలా సుభద్రాదేవి రాసిన "గోడలు" కథలో కల్చర్‌లేని మనుషులందరూ సహజమైన సమస్యను జటిలమైనదిగా చేస్తూ తడీ మడీ ఆచార వ్యవహార పూజా భక్తుల చిక్కుముళ్ళులో ఇరికించి ఎలా ప్రవర్తిస్తారో చెప్తారు. ఆధునిక గృహ సముదాయాలైన అపార్ట్‌మెంట్లలో ఒక పెద్దాయన చనిపోతే విదేశాల్లో ఉన్న కొడుకులు రావడానికి రెండు రోజులు పడ్తుందని అప్పటిదాకా శవాన్ని అపార్ట్‌మెంట్‌లోకి తీసుకు రావద్దని అందరూ రకరకాల అభ్యంతరాలు వ్యక్తం చేస్తుంటారు.

ఇదంతా ఎంత అర్థంలేని పనో అని సుభాషిణి అనే మరో స్త్రీ బాధపడ్తుంటుంది. మూడోరోజు శవదహనకాండ ముగుస్తుంది. సుభాషిణి పెద్దాయన భార్యను పలకరించడానికి పోయి నిండుగా ఉన్న ఆమె ముఖాన్ని చూసి రేపు పదకొండో రోజున జరగబోయే తంతు వల్ల ఆమె ఎంత వికృతంగా మార్చబడుందో ఊహించుకొని ఆవేదన చెందుతుంది. బాధితురాలు పదకొండో రోజు కర్మకాండకు రమ్మని సుభాషిణితో చెప్తుంది. ఆ రోజు నాకూ ఆయనకూ వేరే పని వెళ్ళాల్సి ఉంది మరోసారి మీ దగ్గరికి వస్తాను అని దాటవేస్తుంది సుభాషిణి.

ఆమె ఇంటికి పోయి కోడలుతో కూడా పదకొండోరోజు తంతు చేస్తారట అది చాలా బాధకరం, అవమానకరం నేను వెళ్ళను నీవు కూడా వెళ్ళకు అని చెప్తుంది. సుభాషిణి తానొక్కతిగా ఆ నీచమైన తంతును ఆపే శక్తి కలిగిలేకపోవడం తాను మాత్రం నిరసనగా దాన్ని చూడకుండా ఉండే విధంగా చూసుకోవడం జరుగుతుంది. వ్యవస్థ కట్టిన గోడలు కూల్చడం అంత కష్టమా ! ? పదిమందినీ కూడగట్టు కోవడం చేతగాక నిస్సహాయ స్థితిలో చాలా మంది బాధపడుతుంటారు. కానీ చొరవ తీసుకొని అమానవీయమైన తంతుల్ని ఆపే ప్రయత్నం చేయరు.

ఈ అసమ అనాగరికమైన అమానవీయ సమాజంలో గుండె గాయాలు కాని వాళ్ళెవరు ? మనసున్న మనుషులకు 'గుండెల్లో గాయాలు' నిత్యకృత్యం. పార్వతి పిల్లలిద్దరూ చిన్నపిల్లలుగా ఉన్నప్పుడే భర్త ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. ఆమెను సంఘం రాతి శిల్పంగా చెక్కాలని పనిముట్లతో ప్రణాళికాబద్ధంగా మీది మీదికి వస్తూంటుంది. సామాజిక న్యాయాన్ని నిర్దాక్షిణ్యంగా తుంగలో తొక్కేస్తుంది. ఆమె చుట్టూ సమాజం నిఘా పెరిగిపోతుంది. ఎన్నో వెతల్ని దాటుకుంటూ ఆమొక వృద్ధాశ్రమం పెట్టి నడుపుతుంటుంది. అక్కడ చేర్చబడే వాళ్ళలో ఒంటరి స్త్రీలు ఎక్కువగా ఉంటారు. ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్తేరు రాణిదీ అదే కథ. ఆమె రెండు వివాహాల్లోనూ మోసపోతుంది. ఆ పీడనలను తప్పించుకొని ఆత్మహత్య చేసుకోబోయి తప్పించబడి పార్వతి ఆశ్రమానికి చేరుతుంది.

పార్వతి మామగారు తాను ఒంటరితనం భరించలేక మళ్ళీ పెళ్ళికి సంబంధం కుదుర్చుకున్నానని ఉత్తరం రాస్తాడు. పార్వతికి రెండో పెళ్ళి చేయాలన్న మాట వచ్చినప్పుడు దాన్ని వ్యతిరేకిస్తూ నానా యాగీ చేసిన మామగారు కాటికి కాల్లుచాపుకున్న వయసులో తాను ఒంటరితనాన్ని భరించలేక పెళ్ళి చేసుకుంటున్నానని కారణం చెప్తాడు. ఎంత టక్కరితనం? ఎంత మోసపు బుద్ధి ? ఏ వయసులో ఏ సందర్భంలోనైనా పురుషుడికి ఉన్న హక్కులు స్త్రీకి మాత్రం నిషిద్ధం. 'గుండెల్లో గాయాలు' కథలో రచయిత్రి సుభద్రాదేవి ప్రస్తావించిన అక్షర సత్యాలు, అక్షరగాయాలు ఈ వాస్తవాలు.

××

సమాజంలో ఎవరూ అభాగ్యులు కారు, సమజమే పౌరుల్నీ, మనుషుల్నీ అభాగ్యులుగా, భాగ్యులుగా మార్చి వేసి విభజిస్తుంది. ఆలోచిస్తే అనాదిగా బుద్ధి వికసిస్తున్న కొద్దీ సంఘ జీవనంలో సమిష్టి భావనల్లో మనుషులు ఒకరికొకరు మేమున్నామంటూ నిలబడకపోయి ఉంటే ఈ సమాజం ఇంకెంత దిగజారిపోయి కంగాలంగా ఉండేదో అనిపిస్తుంది.

భర్త చనిపోయి బతుకు గాయమైన కరుణ ఇద్దరు చిన్న పిల్లలతో ఒంటరిగా జీవితాన్ని ఎదురీదడానికి భయపడుతుంటుంది. రాధ స్నేహితురాలు కరుణకు అండగా ఉంటుంది. రాధ కరుణ నిర్జీవత్వంలోకి జీవాన్ని నింపేందుకు ప్రయత్నిస్తుంటుంది.

కరుణ బాబుకు జ్వరం వచ్చి హాస్పిటల్‌లో చేర్పాల్సివస్తుంది. రాధ ఆ నాలుగు రోజులూ లీవ్‌పెట్టి కరుణతో ఉండి అన్నీ చూసుకుంటుంది. పక్క బెడ్‌లో ఉన్న ఒక పేషెంట్ భార్య కరుణ గురించి అన్ని ఆరాలూ తీసి ఆమెను భర్తపోయిన స్త్రీగా చులకన చేస్తూ సూటిపోటి మాటలతో బాధిస్తుంటుంది. అటు జబ్బుపడి ఉన్న భర్తనూ మాటలతో ఏదో విధంగా బాధిస్తుంటుంది. కరుణ ఆ నాలుగు రోజులూ రెండు రకాలుగా క్షోభను అనుభవిస్తుంది. ఆ స్త్రీకి నరనరానా స్లో పాయిజన్లా చిన్నప్పటి నుండీ సౌభాగ్యవ్రతాలు శరీరమంతటా ప్రవహించి జీర్ణించుకుపోయాయేమో, ఆమెకు ఆమె భర్తకన్నా ముఖ్యం ఆమె సౌభాగ్యత్వంమేమో అని అనుకుంటూ ఆమెకు సైకిక్ ప్రాబ్లం ఉందేమో అని కూడా సందేహిస్తుంది కరుణ.

ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది అన్న కరుణ బేలతనానికి రాధ ఒంటరి జీవితంలోని ఒడిదుడుకులకు నీవింతగా తల్లడిల్లుతూ నీ జీవితాశను చిదిమివేయాలనుకుంటే రేపు నీవు పోతే నీ ఇద్దరు చిన్న పిల్లలు ఎలా బతుకుతారు. తల్లీ తండ్రీలేని అనాథలుగా ముందున్న లోకాన్ని ఎలా ఎదుర్కొంటారు. ఇప్పుడు తల్లిగా తండ్రిగా కలిసిపోయిన నీవున్నావు వాళ్ళకు. రేపు ఎవరూ లేనివాళ్ళుగా చేస్తావా అని అడుగుతుంది. కరుణ అవును నా పిల్లలకు "నేనున్నాను కనుకే" ... అంటూ పిల్లలిద్దర్నీ అక్కున చేర్చుకుంటుంది.

××

సమాజం వితంతు స్త్రీల ముఖాన 'నో ఎంట్రీ బోర్డు' అడ్డుగా పెట్టేస్తుంది. నిషేధ సూత్రాలనూ శాసనాలనూ లిఖించిన ఆ బోర్డు ఆమెకు వ్యక్తిగా స్వేచ్ఛా జీవిత అర్థతలను కుదించి సమాజంలోకి దారులను మూసివేస్తుంది.

ఇది ఊహాగానం కాదు, ఊహా చిత్రరచనా కాదు. క్రూరమైన నిజం. మహిళల మానవ హక్కుల దహనకాండ ఉత్సవానికి లోకం ఎల్లవేళలా మంటలు పెట్టడానికి సిద్ధంగా ఉంటుంది.

శీలా సుభద్రాదేవి ఈ మూడు కథల్లో ఒంటరి స్త్రీ జీవన సంక్షోభాలను చిత్రించారు. సమాజానికి కళ్ళూ, చెవులూ, నోరే కాదు బుద్ధి ఉండాలన్న సందేశం సూక్ష్మంగా ఈ కథల్లో కనిపిస్తుంది. హృదయంలేని మనుషుల వ్యవస్థ ఉత్త కాగితపు బొమ్మలాంటి నిర్జీవమైన రాతిశిలలాంటిది. స్త్రీల జీవితాల్లో గుండె గాయాల మంటలార్పడానికి కదలని సమాజాన్ని సవాల్ చేస్తూ.. అర్థంలేని అనాచారాల ఇనుపగోడల్ని కూల్చివేస్తూ మారాలి ఈ సంఘజీవులు, మార్చాలి కుళ్ళు నియమాచారాలను, ఈ యథాతథ సమాజం ఒక సమాజమేనా ! ? ఆలోచించండి అన్న సందేశం ఈ కథల్లో అక్షరక్షరమై ప్రశ్నిస్తుంటుంది.





– అనిశెట్టి రజిత
9849482462

# నిదర్శనం..!!

లోకం అంతా
ఒకేలా వినిపించే ఆకలికేకలు..

శ్రమకి తగ్గ ఫలితం దక్కని
శ్రామికుల స్వేదాలు..

అనుబంధాలకు
రూపాయలతో బంధనాలు..

సొంత ఆనందాల కోసం
స్వార్థం నిండిన చిత్తాలు..

జ్ఞానం నేర్పని చదువులు
బతుకుతెరువుగా బోధనలు..

అర్థం కాని రోగాలకు
వ్యర్థ వైద్యాల ఖర్చులు..

మార్చేసిన సాక్ష్యాలతో
ఖననమయ్యే నిజాలు..

నమ్ముతున్న దేవుళ్ళు
వ్యాపారాలకు పెట్టుబళ్ళు..

కాలం ఇలా మారిపోతే..
ఇంకా నిదర్శనమెందుకు.. ?!

కళ్లముందు కనిపిస్తోంది
కలికాలం !!



–పేరిశెట్టి బాబు
9247170800

# కన్నీళ్లను ఖననం చెయ్యి

తల్లికడుపులోనుండి మొదలయిందే
తండ్లాటల ఒంటరి పోరాటం ...
ఆటవికతలనుండి అవలంబించిందే
అలుపెరుగక నిలదొక్కుకున్నదే ..
అడుగడుగున సుపరిచితమే...
అంతగా నూతనత్వమేమి లేదు ...

నిలిచిన నీరు కుళ్లిపోయి
పారే నీరు పవిత్రమైనట్టు...
నిలబడి నీరసించి కన్నీరు
పెట్టుకుంటే ప్రయోజనం శూన్యం ...

రాతిపనిముట్లుగ రాటుదేలినా ...
శిలలెన్నో శిల్పంగా మారినా ...
సంకల్పం తలకెత్తుకుంటే
పట్టుదల దీక్షలే పెట్టుబడిగా ....

గమ్యమెరిగి చరించుమా
గగనమైనా భీతిల్లకుమా
గమనం నీవెన్నుకొనుమా

విజయం నీ చెంత నిలుచునూ ...

ఎవరో వస్తారని...ఎదురు చూడకు
జగతి నిన్ను మెచ్చు విధముగ
భవిత నీకు నీవుగా నిర్మించుమా
ఉదాహరించే విధముగానూ
చరితనంతా తిరగరాయుము ..

నీకు నువ్వే ఎపుడు గొప్ప
తగవు న్యూనతమ్ములు
తుడిచి కన్నీళ్లు ఖననం చేసి
తలువుము నీ సామర్థ్యమ్ములు
తోడు నిలుచును తథాస్తులు
కూడ వచ్చును మకుటమై గుర్తింపులు
చేరవచ్చును కీర్తి శిఖరమై ...



–నగునూరి రాజన్న
8332963129

# కాలాన్ని జయించడమే !

ఓ యుద్ధమే చేయాలి
ఆలోచననూ,ఆవేశాన్ని ఒక్కగాటుకు కట్టి
కవిత్వాన్ని వెలికితీయాలంటే
నిజంగా ఓ యుద్ధమే చేయాలి

ఈ యుద్ధంలో
కత్తులూ , బళ్ళాలూ కానరావు
రక్తం యేరులైపారదు
శత్రువులెవరూ కంటికి కనిపించరు
సువిశాల అంతరంగపు యవనికపై
సమస్యలశత్రువులనోడించడానికి
ఆలోచనల సానరాళ్ళపై
పెన్నును సానబెట్టి చేసే యుద్ధమే ఇది.

ఈ యుద్ధంలో
సమస్యల మారణాలెన్నో
కొత్త సమస్యల జననాలూ అన్నే..
ఇది ఎడతెరిపిలేని యుద్ధం
ఆయుధాలను సానబెట్టడంమరచావా?
అంతే సంగతి.

ఏదేమైనాయుద్ధంజరిగినప్పుడే
మనమెందుకుపుట్టామో తెలుస్తుంది
యుద్ధం జరిగినప్పుడే
మన ఆయుధబలమేంటో తెలుస్తుంది
యుద్ధంచేయడమంటే
కాలాన్ని వృధాచేయడంకాదు
కవితాస్త్రాలతో కాలాన్ని జయించడం



–ఎన్.నరేశ్ చారి
9701334516

# పచ్చి నిజం

రెక్కలు మొలుస్తాయట ఆశలకు.....
పగ్గాలు వేయాలి మరి, పట్టి లాగాలంటే..
పరుగులు తీయకూడదు,
సన్నటి వెలుగు కనబడిందని....
చీల్చుకొని వెళ్లాలి చిమ్మచీకట్లను..
సాహస కృత్యమై సాగాలి అగాధాల వెంట..
అందుకోవాలి అవకాశాల ఆసరాలను..
నింపుతూ పోవాలి కాల పరీక్షల కాగితాలను..
ఎవరూ ఒప్పుకోరు కానీ,.....
ఆకాశానికి అమాంతంగా ఎగరలేకపోవడం
పచ్చి నిజమంత నిజం.....
అసలు విజయం,
అడుగులో అడుగు కదిపినప్పుడే....
మెట్టు మెట్టుకీ ఆశ, నిరాశల ఊగులాట...
తాకట్టు పెట్టాల్సి ఉంటుంది
అభిమానాన్ని కూడా అప్పుడప్పుడూ.....
మామూలే తలవంపులు, విదిలింపులూను..
ప్రశంసల ప్రవాహాలు ఒకపక్క
విమర్శల విలాపాలు మరోపక్క,
అందరికీ నచ్చక పోవడం సహజం
కొందరే ఒప్పుకోవడం ఇంకా సహజం
చూసే మనసును బట్టే భావన కూడా..
అందుకే......
తావు ఉండకూడదు, పట్టింపులకు, పట్టుదలకు
వేస్తున్న అడుగుల ఆలోచనలను
ఎంచుకున్న మార్గమే నిర్దేశిస్తుంది...
విజయమే గమ్యమవుతుంది
ఆశయం మంచిదైతే ........
అనుకున్నవన్నీ చెంతకు చేరుతాయి
వ్యక్తిత్వాన్ని కోల్పోనంతవరకే......!!!!!!



– అరుణ ధూళిపాళ
8712342323

# ఆఖరి ఊపిరి అక్కడే ఆగిపోవాలి

ఎందుకో ఆ నేల మీద
పాదం మోపగానే
ప్రాణం రెక్కలు తొడుక్కుంటది
ఎందుకో ఆ మట్టిని తాకగానే
అమ్మ ఒడిలో ఒడుపుగా ఒదిగి నట్టుంటది
ఎందుకో ఆ గాలిని పీల్చగానే
మనసంతా చైతన్య కిరణమై ఉరకలేస్తది
అదే "మానుకోట" మా మమతల మూట

సాయుధ పోరాటంలో ఎర్ర మల్లె పూసి
రజాకార్లపై నిప్పుకణమై ఎగిసిపడిన గడ్డ
దాశరధి అక్షరాలే సమర ఆయుధాలై
ప్రత్యేక కాంక్షను నలుదిశల కోడై కూసిన అడ్డ

ఇక్కడి గడ్డిపరకలు సైతం మీసం మెలేసి
అన్యాయపు సంకెళ్ళపై
బరాబర్ బరిగీసి కొట్లాడుతయ్.

ఇక్కడి కంకర రాళ్లకు సైతం పౌరుషం పొంగి
పొర్లి చీడ పురుగులపై ఫిరంగులై పేలుతయ్
తల్లి పాలు తాగి తల్లి రొమ్మును గుద్దేటోళ్ళపై
పడగ పాములై పసిగట్టి బుసకొడతయ్
అస్థిత్వాన్ని దెబ్బతీసే పరాయి జలగలపై
రాళ్ళ వర్షం కురిపించి

చరిత్ర పుటల్లో కుదురుగా చేరిపోతయ్

కడుపులో కల్మషం లేని మట్టి మనుషులు
తిరిగే మమతల కోవెల ఆ నేల
భిన్న మతాలు ఒకే దారంలో ఒదిగిపోయిన
కుసుమాల హారం ఆ నేల
మున్నేరు వాగు మానుకోట తల్లి పాదాలను
తాకి పరవళ్ళు తొక్కి పచ్చదనాన్ని పరిచి
పసిడి పంటలకు పురుడుపోస్తున్న ఆ నేల
చెమట చుక్కలను చిందించి
ఆరబెట్టిన పేగులకు పట్టెడన్నం అందించే అక్షయపాత్ర
ఆఖరి ఊపిరి అక్కడే ఆగిపోవాలని
అక్కడి కాడులో కట్టె మండి పోవాలని
అక్కడి మట్టిలో బూడిదై కలిసిపోవాలని
అక్కడి తరువులకు ఎరువై కుసుమాల
వనంగా మారిపోవాలని నా ఆకాంక్ష.



– తాటిపాముల రమేశ్
7981566031

# నేటి భారతం...

ఈ నవ భారతంలో
సహస్రాధి దుర్యోధనులు
శతాధిక శకునులు
ఎత్తులు వేస్తున్నారు
కత్తులు దూస్తున్నారు
మెత్తని ధర్మ మూర్తులను
చిత్తుగా జయించే సి
చిప్ప చేతికి ఇస్తున్నారు
శివారుల దాటిస్తున్నారు.

ఈ నవ భారతం లో
కోటి దుశ్శాసనుల సమూహం
'నీతి 'నాతి వలువలను
నడిబజారులో వొలుస్తున్నారు
నవ్వులపాలు చేస్తున్నారు,

ఈ నవ భారతం లో
అనంతకోటి అభినవ
కర్ణులు
పదవులనాశిస్తూ
పెదవులకు తేనె రాస్తు
వంత పాట పాడుతున్నారు
వజీరుల వేడుతున్నారు

న్యాయాన్ని సమాధి చేసి
కాయాన్ని పెంచుతున్నారు.

ఈ దుర్యోధనుల దుమ్ము
దులపడానికి
ఈ దుశ్శాసనుల
నలపడానికి
ఈకర్ణుల దుంపలు
దెంపడానికి
ఈ తరంలో శౌర్యం
నింపడానికి
యువ భీములు
నవ నరులు
ముందుకొచ్చిన నాడు
నవ భారత చరిత్ర
చరిత్రలో నిలుస్తుంది
పసిడి పుటలలో నుండి
పది కాలాలు మెరుస్తుంది.



– రస స్రవంతి –9290215858
–కావ్యసుధ – 9247313488

# నవ్వీన నాపచేనే పండింది (కథ)

అబ్బో నేనింతటోణ్ణి ఎక్కడా చూడలేదమ్మ అంటూ మూతి మూడొం కరలు తిప్పింది రాధ.

ఏంటే ? ఏమైందిప్పుడు ? అంది వేద.

ఏంలేదే. వీడే పెద్ద గొప్పోడైనట్టు,వీడికే అన్నీ తెలుసన్నట్టు పెద్ద పోజు. చూడవే కాస్త ఈ సెల్ఫోన్లో మాట్లాడాలంటే ఏదో వాట్సాప్ ఉందట. ఎట్లా చేయాలో తెలీదు. ఇప్పుడిప్పుడే చూస్తున్న. సెల్ఫోన్ పట్టుకోవడం కొత్త కదా. నేర్పమంటే చూడు వాడి పోజ్ అన్నది రాధ.

అవును మరి ఈకాలం పిల్లలే అంత వాళ్లకు అన్ని వెన్నతో పెట్టిన విద్య.పుట్టుకతోనే సెల్ చేతిలో లేకుంటే ఏడుపే. అన్నం తిన్నా సెల్ కావాలి. ఆటలకు సెల్.చదువులకు సెల్.సెల్ యుగం కదా అన్నది వేద. ఏముంది పెద్ద విద్య. శ్రద్ధతో నేర్చుకుంటే అన్ని వస్తాయి. అదో బ్రహ్మ విద్య.నేను చెపుతాను కదా అని ఎప్పుడు సెల్ పట్టుకోని రాధకు ఎట్లా వాడాలో చెప్పింది.

కొత్త బిచ్చగాడు పొద్దెరుగనట్టు రాధ రాత్రి పగలు ఎప్పుడు చేతిలో సెల్ ఉండాల్సిందే. తిండి లేకున్నా ఉంటుందేమో కానీ సెల్ లేకుండా వుండలేకపోతుంది.

దీనివల్ల కూడా లాభాలు, నష్టాలు ఉన్నాయి. వాడుకునే విధానం బట్టి గొప్పవాళ్ళు కావచ్చు, చాటింగ్‌లో చీటింగ్ వల్ల మోసపోవచ్చు.

రైల్వేలో కూలిపని చేస్తూనే సమయం దొరికినప్పుడు ఆన్లైన్ లో కష్టపడి చదివి సివిల్స్‌లో ర్యాన్కు తెచ్చుకుని ఐ.ఏ.స్. అయ్యాడు ఒకతను.

చదువుకోమని హైదరాబాద్‌లో హాస్టల్లో ఉంచితే ముఖపుస్తకంలో చేరి ముఖం చూడకుండా ప్రేమకు బలై జీవితాన్ని నాశనం చేసుకుని వాడి చేతిలో హతమయ్యి కన్నవాళ్లకు కడుపుకోతను మిగిలించింది ఒక అమ్మాయి.

ఇలా సెల్ ఫోన్ వార్తలను తెలుసుకుంది రాధ. బి.ఏ వరకు మెల్లమెల్లగా ఇంట్లో కూచుని ప్రయివేటుగా చదివి పాసయ్యింది. పొద్దుటి నుండి ఇంట్లో పని. అమ్మ నాన్నలు పెద్దవాళ్ళు.అన్ని చక్కదిద్దుకుంటూనే సివిల్స్ పరీక్షకు తయారైంది. తమ్ముడు ఏదో చిన్న కంపెనీలో ఉద్యోగం. చదువు అబ్బలేదు పెద్దగా. ఇంటర్ పాస్ అంతే.

రాధ సెల్ఫోనులోనే ఎన్నో విషయాలు తెలుసుకుని రాత్రి పగలు కష్టపడి శ్రద్ధగా చదివి సివిల్ ర్యాన్కు కొట్టేసింది. ఇంటర్వ్యూలో కూడా పాసై టాప్‌లో నిలిచింది.

కలెక్టరమ్మ అయ్యింది. అందరూ ముక్కున వేలేసుకున్నారు.ఎప్పుడు చదివిందో. ఎప్పుడు ఇంట్లోనే వుండే అమ్మాయి ఇంత గొప్పగా. ఆడపిల్లకు పెళ్లి చేయలేని కన్నవారి దుస్థితిని చూసి చుట్టపక్కాలు అందరూ వెక్కిరింపులు, సూటిపోటి మాటలతో మానసికంగా బాధ పెట్టారు. సాయం చేసేది లేదు కానీ వ్యంగ్యాస్త్రాలు విసరడం.

ఏదో సాధించాలనుకుని సెల్ఫోన్ వాడకం కూడా తెలీని రాధ కలెక్టర్ అయింది ఏ కోచింగ్ లేక ఒక్క సెల్ ఫోన్‌తోనే కదా. ఏదైనా వస్తువును ఉపయోగించుకోవడంలో ఉంటుంది. నవ్వీన నాపచేను పండింది. అమ్మానాన్నను ప్రేమతో చూసుకుంది. ఆడ మగ ఎవరైతేనేం ప్రయోజకులు అయితే చాలు అని ఒకప్పుడు ఎక్కిరించిన పక్కవాళ్లే ఇలా అంటుంటే మాటలు విని నరం లేని నాలుక పలికేది ఎన్నో రకాలు అనుకొని డ్యూటీకి వెళ్ళింది తృప్తిగా.



–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

